


Truth of News

PRGI Reg No: APTEL/26/A4781

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

అన్నమయ్య జిల్లా | సంపుటి: 03 | సంచిక : 57 | సోమవారం 05 అక్టోబర్ 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

## జ్ఞానేష్‌కుమార్ రాజీనామా చేయాలి

- జంతర్‌మంతర్, ఇండియా గేట్‌ల వద్ద ఆప్ నేతల భారీ నిరసన ప్రదర్శన
- ఉద్రిక్తతకు దారి తీసిన ఆందోళన బస్సులను అడ్డుకున్న ఆప్ కార్యకర్తలు
- నాయకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు



న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఢిల్లీలోని జంతర్ మంతర్, ఇండియా గేట్ పరిసరాల్లో ఆదివారం భారీ నిరసన ప్రదర్శనలు చేపట్టింది. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో తీవ్ర అక్రమాలు జరిగాయని

- మిగతా 2లో..

## జ్ఞానేశ్ రాజీనామా చేసి వెళ్లిపో

- అధికారం ఎవరికనేది ప్రజలు నిర్ణయిస్తారు
- మహారాష్ట్రలో సర్‌ను రద్దు చేయాలి
- ఈసీకి వ్యతిరేకంగా ముంబైలో ఉద్ధవ్ ఠాక్రే, రాజ్ ఠాక్రే సంయుక్త ర్యాలీ
- మద్దతు తెలిపిన కాంగ్రెస్, శివసేన (ఎస్పీ)
- సీఈసీ నిర్ణయాలపై నేడు సుప్రీంలో విచారణ

ముంబై- సూర్య వాస్తవం

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే, మహారాష్ట్ర నవనిర్మాణ సేన(ఎంఎన్ఎస్) అధ్యక్షుడు రాజ్ ఠాక్రే సంయుక్తంగా ఆదివారం ముంబైలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. 'విరాట్ గర్జన మోర్చా' పేరుతో జరిగిన ఈ ర్యాలీలో కాంగ్రెస్‌తోపాటు శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సీపీ(ఎస్పీ) నేతలు కూడా పాల్గొని మద్దతు పలికారు. బైకులాలోని రిచర్డ్‌సన్ అండ్ క్రుడ్డాస్ నుంచి ఆదివారం ఉదయం మొదలైన ఈ ర్యాలీ దక్షిణ ముంబైలోని



బీఎంసీ ప్రధాన కార్యాలయం వరకు కొనసాగింది. పార్టీ జెండాలను పక్కన పెట్టి.. జాతీయ పతాకాన్ని చేబూని ఈ ర్యాలీ

- మిగతా 2లో..



## 'సత్యాగ్రహం' స్టార్ట్

- 9 గంటల్లోనే 10 వేల స్పందనలు
- సీఈసీపై నిరసనలకు రాహుల్ కొత్త అస్త్రం

న్యూఢిల్లీ- సూర్య వాస్తవం

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలనే డిమాండ్‌తో దేశవ్యాప్తంగా నిరసనలు కొనసాగుతున్న వేళ.. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రజల ఆందోళనలు, నిరసన ఉద్యమాలను ఒకే వేదికపైకి తీసుకొచ్చేందుకు 'సత్యాగ్రహం' పేరుతో ప్రత్యేక డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభించారు. ఈ వేదిక ప్రారంభమైన కొద్ది గంటల్లోనే భారీ స్పందన రావడం రాజకీయంగా ఆసక్తికరంగా మారింది. శనివారం సోషల్ మీడియాలో విడుదల చేసిన వీడియోలో రాహుల్ గాంధీ

- మిగతా 2లో..

## ఇండియా కూటమిలోకి విజయ్ టీవీకే..

- చారిత్రక దినమన్న కాంగ్రెస్
- బీజేపీ వ్యతిరేక కూటమి మరింత బలపడిందన్న మాణికం టాగోర్
- ఎన్నికల కమిషన్ చీఫ్‌కు వ్యతిరేకంగా నిరసనలకు కూటమి నిర్ణయం
- అక్టోబర్ 13 నుంచి 15 వరకు ఆందోళనలకు పిలుపు



చెన్నై - సూర్య వాస్తవం

తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ముఖ్య మంత్రి సి.జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కజగం (టీవీకే) పార్టీ ప్రతిపక్షాల ఇండియా కూటమిలో చేరింది. ఈ విషయాన్ని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు బి.మాణికం టాగోర్ శనివారం అధికారికంగా ప్రకటించారు. చెన్నైలోని టీఎన్‌సీసీ కార్యాలయంలో జరిగిన బహుళ పార్టీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశానికి టీవీకే తరఫున మంత్రులు ఆధవ్ అర్జున, ఎన్.మేరీ విల్సన్ హాజరయ్యారు. టీవీకే చేరికను 'చారిత్రక దినం'గా అభివర్ణించిన మాణికం టాగోర్, ఈ పరిణామంతో తమిళనాడులో బీజేపీ వ్యతిరేక కూటమి మరింత బలపడుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ భేటీలో కాంగ్రెస్, టీవీకేతో పాటు సీపీఎం, సీపీఐ, వీసీకే, ఎండీఎంకే, ఐయూఎంఎల్ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఈ సమావేశంలో మరో కీలక నిర్ణయం కూడా తీసుకున్నారు. ఓటర్ల జాబితా సవరణ అంశంపై ఎన్నికల కమిషన్ చీఫ్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేపట్టాలని

- మిగతా 2లో..




## మహిళా జర్నలిస్టులపై ఢిల్లీ పోలీసుల లైంగిక వేధింపులు!

- జంతర్‌మంతర్ వద్ద ఘటన
- ముగ్గురు మహిళా జర్నలిస్టుల ఆరోపణ
- ఏసీపీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి
- పోలీసుల తిరస్కరణ.. జర్నలిస్టుల నిరసన

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం పలు సంఘాలు ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న సమయంలో రిపోర్టింగ్ చేయటానికి వెళ్లిన తమపై పోలీసులు లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ముగ్గురు మహిళా జర్నలిస్టులు ఆరోపించారు. ముఖ్యంగా ఏసీపీ వివేక్ భగత్ తనను అనుచితంగా తాకుతూ తోసివేశాడని ఒక జర్నలిస్టు ఆరోపించారు. మహిళా నిరసనకారులను

- మిగతా 2లో..




## సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై 2006 నాటి ఆరోపణలపై విజిలెన్స్ విచారణ

- కేరళ పీడబ్ల్యూడీ కార్యదర్శిగా ఉన్న సమయంలో రహదారి ప్రాజెక్టులో అవకతవకల ఆరోపణలు
- మలేషియా ఇంజినీర్ లీ సీ బీన్ మృతితో ముడిపడిన వ్యవహారంపై పునర్విచారణకు ఆదేశాలు

2లో

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## 2029 నాటికి 9 లక్షల ఇళ్ల నిర్మాణం

- సీఎం చంద్రబాబు
- అత్యాధునిక త్రీడీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీ వినియోగం
- పైలట్ ప్రాజెక్టులో 5 వేల ఇళ్ల నిర్మాణం.. దేశానికి దిక్సూచి
- గొడ్డలి పార్టీ ప్రభుత్వంలో పేదల ఇళ్ల నిర్మాణం భ్రష్టు
- ఇళ్ల స్థలాల పేరుతో అంతులేని అవినీతి: చంద్రబాబు
- బుర్రిపాలెంలో పీఎంఏవై-గ్రామీణ్ 2.0 ప్రారంభోత్సవం
- శివరాజ్‌తో కలిసి పైలట్ ప్రాజెక్టు ఇళ్లకు శంకుస్థాపన




గుంటూరు - సూర్య వాస్తవం

రాష్ట్రంలో పేదలందరికీ సొంత ఇంటి కలను 2029 నాటికి సాకారం చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఇది ఎన్నికలకు ముందు ఎన్‌డీఏ కూటమి పేదలకు ఇచ్చిన హామీ అని, దానిని తప్పక నిలబెట్టుకొంటామని చెప్పారు. ఆదివారం గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గంలోని బుర్రిపాలెం గ్రామం నుంచి పీఎంఏవై-జీ 2.0 కార్యక్రమానికి కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో కలిసి సీఎం శ్రీకారం చుట్టారు. ఈ పైలట్ ప్రాజెక్టుకు సంబంధించి సీఎస్ఐఆర్ (కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్)-సీబీఆర్ఐ(సెంట్రల్ బిల్డింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్) రూర్కీతో ఒప్పందం చేసుకొని పత్రాలపై సంతకాలు చేశారు. అనంతరం ప్రథమ లబ్ధిదారు తుపాకుల లక్ష్మీదుర్గకు ఇంటి మంజూరు పత్రం

- మిగతా 2లో..



## వేగం పెంచాలి

- కలెక్టర్లు ఫీల్డ్‌కు వెళ్లాల్సిందే..
- దవాఖానలు, పాఠశాలలను సందర్శించాలి వారానికోసారి సమీక్ష తప్పనిసరి
- సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి: సీఎం

హైదరాబాద్ - సూర్య వాస్తవం

జిల్లా కలెక్టర్లు తప్పనిసరిగా క్షేత్ర పర్యటనలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ముఖ్యంగా ఆస్పత్రులు, పాఠశాలలు, వసతి గృహాలను సందర్శించి, వారానికోసారి జిల్లా స్థాయి సమీక్ష నిర్వహించాలని స్పష్టం చేశారు. శనివారం సీఎంవో అధికారులతో రివ్యూ నిర్వహించారు. విద్య, వైద్యానికి సంబంధించిన క్షేత్రస్థాయి పరిస్థితులపై

- మిగతా 3లో..

Truth of News
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in



# జ్ఞానేశ్ రాజీనామా చేసి వెళ్లిపో

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించడం గమనార్హం. ఈసీఐ ఒక్కటే తమ అజెండా అని, బీజేపీ సైతం ర్యాలీలో పాల్గొనవచ్చని రాజ్‌ఠాక్రే ప్రకటించారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, మహారాష్ట్రలో నిర్వహించిన సర్‌ను రద్దు చేయాలని ఠాక్రే సోదరులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఉద్ధవ్ ఠాక్రే.. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ బీజేపీ చేతిలో ఆయుధంలా, ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. బంగ్లాదేశ్ అక్రమ వలసదారులకు వ్యతిరేకంగా సర్ చేపట్టినట్లయితే ఎంత మంది అక్రమ వలసదారులను గుర్తించారో చెప్పాలని డిమాండ్ చేశారు. మహారాష్ట్రలో సర్ తర్వాత సుమారు 2 కోట్ల మంది ఓటర్లు ముసాయిదా జాబితాలో కనిపించకపోవడాన్ని ప్రస్తావించారు.

అధికారంలోకి రావడానికి బీజేపీ ఓట్లను, ఎమ్మెల్యేలను చోరీ చేస్తోందని ఆరోపించారు. ఎంఎన్ఎస్ చీఫ్ రాజ్‌ఠాక్రే మాట్లాడుతూ.. బ్యాలట్ విధానంలో తిరిగి ఎన్నికలను నిర్వహించాలని కోరారు. ఎవరు అధికారంలో ఉండాలో ఎన్నికల సంఘం నిర్ణయించజాలదని, దాన్ని ప్రజలు నిర్ణయిస్తారని చెప్పారు. ఇదిలా ఉండగా, సర్‌కు సంబంధించి సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తీసుకున్న ఏకపక్ష నిర్ణయాలను సవాలు చేస్తూ దాఖలైన రెండు పిటిషన్లపై సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం సోమవారం విచారణ నిర్వహించనుంది.

# ఇండియా కూటమిలోకి విజయ్ టీవీకే..

(మొదటిపేజీ తరువాయి)

కూటమి నిర్ణయించింది. ఇందులో భాగంగా అక్టోబర్ 13, 14 తేదీల్లో జిల్లా స్థాయి ప్రదర్శనలు, అక్టోబర్ 15న చెన్నైలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించాలని తీర్మానించారు. ఇండియా కూటమిలో తమ పార్టీ అధికారికంగా చేరినట్లు టీవీకే మంత్రి ఆధవ్ అర్జున సైతం ధ్రువీకరించారు. అయితే, దీనిపై పార్టీ అధినేత, ముఖ్యమంత్రి విజయ్ నుంచి నేరుగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు.

# 'సత్యాగ్రహం' స్టార్ట్

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడుతూ.. దేశంలో నిజం అణచివేతకు గురవుతోందని, ప్రతిపక్ష నేతగా ప్రజల పోరాటాలకు అండగా నిలవడం తన బాధ్యతని పేర్కొన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న నిరసనలు, ప్రజా ఉద్యమాల వివరాలను ఈ డిజిటల్ వేదిక ద్వారా నమోదు చేసుకునే అవకాశం కల్పించారు. ప్లాట్‌ఫామ్ ప్రారంభమైన కేవలం తొమ్మిది గంటల్లోనే 10 వేలకు పైగా స్పందనలు వచ్చినట్లు రాహుల్ వెల్లడించారు. తమ మాట ఎవరూ వినడం లేదని భావిస్తూ ఎంతోమంది ప్రజలు పోరాటాలు చేస్తున్నారని, వారి ప్రతి స్పందనను పరిశీలిస్తామని తెలిపారు. మరోవైపు జజుజ తొలగింపు డిమాండ్‌తో ప్రతిపక్ష నేతలు, పౌర సమాజ కార్యకర్తలు, యువజన సంఘాల నిరసనలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో రాహుల్ ప్రారంభించిన 'సత్యాగ్రహ డిజిటల్ ప్లాట్‌ఫాం' రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై 2006 నాటి ఆరోపణలపై విజిలెన్స్ విచారణ

**- కేరళ పీడబ్ల్యూడీ కార్యదర్శిగా ఉన్న సమయంలో రహదారి ప్రాజెక్టులో అవకతవకల ఆరోపణలు**

**- మలేషియా ఇంజినీర్ లీ సీ బీన్ మృతితో ముడిపడిన వ్యవహారంపై పునర్విచారణకు ఆదేశాలు**

**తిరువనంతపురం- సూర్య వాస్తవం**

ప్రధాన ఎన్నికల కమిషనర్ సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు సంబంధించిన దాదాపు రెండు దశాబ్దాల నాటి ఆరోపణలపై కేరళ ప్రభుత్వం విజిలెన్స్ అండ్ యాంటీ కరప్షన్ బ్యూరో వీఏసీబీ తో ప్రాథమిక విచారణకు ఆదేశించింది. 2006లో జ్ఞానేశ్ కుమార్ కేరళ రాష్ట్ర ప్రజాపనుల శాఖ పీడబ్ల్యూడీ కార్యదర్శిగా పనిచేసిన సమయంలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అవకతవకలు, మలేషియా ఇంజినీర్ లీ సీ బీన్ ఆత్మహత్యకు సంబంధించిన అంశాలపై తాజా విచారణ జరగనుంది. కాంగ్రెస్ నేత మలయంకీఴు వేణుగోపాల్ ఇచ్చిన ఫిర్యాదును పరిశీలించిన అనంతరం కేరళ హోంమంత్రి రమేష్ చెన్నితాలా వీఏసీబీకి ఈ ఆదేశాలు జారీ చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. గతంలో ఇదే వ్యవహారంపై జరిగిన ప్రాథమిక విజిలెన్స్ విచారణకు సంబంధించిన రికార్డులను కూడా ప్రభుత్వం పరిశీలనలోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ వ్యవహారం కేరళ స్టేట్ ట్రాన్స్‌పోర్ట్ ప్రాజెక్టు కేఎస్‌టీపీ కింద చేపట్టిన ఎంసీ రోడ్ అభివృద్ధి పనులకు సంబంధించినది. ఆ సమయంలో ఇండో--మలేషియా భాగస్వామ్య సంస్థ ప్యాటీ--బెల్ కన్సార్టియం ఈ ప్రాజెక్టులో పనులు చేపట్టింది. ఈ సంస్థతో సంబంధం ఉన్న మలేషియా ఇంజినీర్, ప్రాజెక్టు బాధ్యతలు నిర్వహించిన లీ సీ బీన్ 2006లో ఆత్మహత్య చేసుకున్నారు. ఆయన రాసినట్లు చెబుతున్న సూసైడ్ నోట్‌లో అప్పటి పీడబ్ల్యూడీ కార్యదర్శి జ్ఞానేశ్ కుమార్ పేరు ప్రస్తావనకు వచ్చినట్లు పలు నివేదికలు పేర్కొన్నాయి. రహదారి పనులకు సంబంధించిన బిల్లులు, చెల్లింపులు, కాంట్రాక్టు నిర్వహణలో అవకతవకలు చోటుచేసుకున్నాయని, కాంట్రాక్టు సంస్థ నుంచి లంచం డిమాండ్ చేసినట్లు కూడా ఫిర్యాదులో ఆరోపణలు ఉన్నాయని అధికారులు తెలిపారు. అయితే ఈ ఆరోపణలు విచారణలో తేలాల్సిన అంశాలే తప్ప నిర్ధారిత వాస్తవాలుగా పరిగణించలేమని సంబంధిత నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

2006లో లీ సీ బీన్ మృతికి అనంతరం ఈ వ్యవహారంపై విజిలెన్స్ విచారణ ప్రారంభమైనప్పటికీ, అది ముందుకు సాగలేదని తాజా నివేదికలు పేర్కొంటున్నాయి. అనంతరం జ్ఞానేశ్ కుమార్ కేంద్ర ప్రభుత్వానికి డిప్యుటేషన్‌పై వెళ్లడంతో విచారణ నిలిచిపోయినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఇప్పుడు గత విచారణలోని అంశాలను కూడా పునఃపరిశీలించి, అప్పటి పరిస్థితులు, ఆరోపణలు, విచారణ ఎందుకు ముందుకు సాగలేదనే అంశాలను పరిశీలించనున్నారు. ఈ ప్రాజెక్టు వరల్డ్ బ్యాంక్ నిధులతో చేపట్టిన కేఎస్‌టీపీ కార్యక్రమంలో భాగంగా ఎంసీ రోడ్ అభివృద్ధికి సంబంధించినదని నివేదికలు పేర్కొంటున్నాయి. ప్రాజెక్టు నిర్వహణలో పరిపాలనా లోపాలు, చెల్లింపుల్లో జాప్యం, పనుల పర్యవేక్షణ, కాంట్రాక్టు నిర్వహణ వంటి అంశాలపైనా గతంలో ప్రశ్నలు తలెత్తినట్లు వార్తా కథనాలు వెల్లడించాయి. ప్రస్తుత సీఈసీగా జ్ఞానేశ్ కుమార్ ఎన్నికల వ్యవహారాలపై ప్రతిపక్షాల విమర్శలు, నిరసనలు ఎదుర్కొంటున్న సమయంలోనే ఈ పాత వ్యవహారంపై కేరళ ప్రభుత్వం తాజా విచారణకు ఆదేశించడం రాజకీయంగా కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే ప్రస్తుత రాజకీయ పరిణామాలు, 2006 నాటి ఆరోపణలపై జరిగే విజిలెన్స్ విచారణను వేర్వేరు అంశాలుగా చూడాల్సి ఉంటుంది. తాజా విచారణలో ఆరోపణలకు సంబంధించి వాస్తవాలు, అప్పటి అధికారుల పాత్ర, గత విచారణ పరిస్థితులు తదితర అంశాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. వీఏసీబీ ప్రాథమిక విచారణ అనంతరం అందుబాటులోకి వచ్చే ఆధారాలు, రికార్డుల ఆధారంగా తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం జ్ఞానేశ్ కుమార్‌పై ఉన్న ఆరోపణలు విచారణలో ఉన్న అంశాలుగా మాత్రమే పరిగణించాల్సి ఉంటుంది.

# జ్ఞానేష్‌కుమార్ రాజీనామా చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

ఆరోపిస్తూ, ఎన్నికల సంఘం పనితీరులో పారదర్శకత లోపించిందని ఆప్ ఈ ఆందోళన చేపట్టింది. అక్రమాలకు బాధ్యత వహిస్తూ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఆప్ పార్టీ నాయకులు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కాగా ఆప్ నాయకులు, కార్యకర్తలు జంతర్ మంతర్ వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించగా, ఢిల్లీ పోలీసులు భారీగా బారికేడ్లను ఏర్పాటు చేసి వారిని అడ్డుకున్నారు. పలువురు ముఖ్య నాయకులను, నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకుని బస్సుల్లో తరలించారు.

కాగా ప్రధాన ఎన్నికల అధికారి జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని కోరుతూ ఆమ్ ఆద్మీ పార్టీ దేశ రాజధాని ఢిల్లీలో అక్టోబర్ 2, గాంధీ జయంతి నుంచి ఆందోళన కొనసాగిస్తోంది. అయితే ఆదివారం చేపట్టిన ఆందోళన ఉద్రిక్తంగా మారింది. ఆప్ నేతలు బ్యారికేడ్లు ఎక్కి మరీ జంతర్ మంతర్ వెళ్లేందుకు ప్రయత్నించ దంతో ఘర్షణ తలెత్తింది. దీంతో అక్కడి పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఆప్ కార్యకర్తలతోపాటు ఆ పార్టీ విద్యార్థి విభాగం ఏఎఎస్ఏపీ కూడా ఆందోళనల్లో పాల్గొంటోంది. నిరసన కార్యక్రమంలో భాగంగా చుట్టుపక్కల ప్రాంతాల్లోని రోడ్లను కార్యకర్తలు బ్లాక్ చేశారు. బస్సుల్ని కూడా కదలనివ్వలేదు. ఈ నేపథ్యంలో ఆందోళనకారుల్ని అడ్డు తొలగించేందుకు పోలీసులు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ దళాలు, ఇతర విభాగాల భద్రతా బలగాలు ప్రయత్నించాయి. దీంతో నిరసనకారులకు, భద్రతా బలగాలకు మధ్య ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. ఈ ఆందోళనల్లో ఢిల్లీ ఆప్ చీఫ్ సౌరభ్ భరద్వాజ్, ఎమ్మెల్యే సంజీవ్ ఝా, నేహా బోరా వంటి కీలక నేతలు పాల్గొన్నారు. ఈ క్రమంలో కొందరు బారికేడ్లు దాటి జంతర్ మంతర్ వైపు దూసుకెళ్తుండగా పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఆందోళనల్ని అరికట్టేందుకు దాదాపు ఐదువేలకు మందికిపైగా పోలీసుల్ని మోహరించినట్లు తెలుస్తోంది.

# 2029 నాటికి 9 లక్షల ఇళ్ల నిర్మాణం





(మొదటిపేజీ తరువాయి)

అందజేశారు. ఆమె కుటుంబానికి నూతన వస్త్రాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడారు. 'ప్రధానమంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్ 2.0 కింద కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు రాష్ట్రానికి 75 వేల ఇళ్లు మాత్రమే మంజూరయ్యాయి. అవి ఏమాత్రం సరిపోవు. తొలి విడతగా 3 లక్షల ఇళు కావాలని అడగగానే కేంద్ర ప్రభుత్వం వెంటనే మంజూరు చేసింది.

మరో 6లక్షల ఇళ్లు కావాలని కోరాం. అందుకు కూడా సమ్మతించింది. దాంతో రెండు, మూడు విడతల్లో 3 లక్షల చొప్పున ఇళ్ల నిర్మాణాలు చేపట్టి పేదలందరికీ ఇస్తాం. దేశంలోనే మొదటిసారి త్రీడీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీతో తక్కువ వ్యవధిలోనే ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నాం. పైలట్ ప్రాజెక్టుగా బుర్రిపాలెం, ఓబులునాయుడుపాలెంలో 177 ఇళ్ల నిర్మాణం చేస్తాం. ఆ తర్వాత రాష్ట్రంలోని మరికొన్ని ప్రాంతాల్లో మరో ఐదు వేల ఇళ్లను 3డీసీపీ టెక్నాలజీతో పూర్తి చేస్తాం. దాంతో ఇదొక జాతీయ విధానంగా మారుతుంది. ఇది పేద కుటుంబాల సొంత ఇంటి కల సాకారానికి వేస్తున్న కీలక అడుగు. 2024 అసెంబ్లీ ఎన్నికలకు ముందు విధ్వంసకరమైన రాష్ట్రాన్ని బా గు చేస్తామని చెప్పి ఓటేయాలని కోరాం. ప్రజలు 57 శాతం మంది ఓట్లు వేసి 94 శాతం సీట్లు గెలిపించారు. ప్రజలందరికీ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందిస్తూ సుపరిపాలన చేస్తున్నాం' అని సీఎం చెప్పారు.

**3 డీసీపీ టెక్నాలజీ ఇళ్లల్లో హాయిగా..**

'3డీసీపీ టెక్నాలజీతో నిర్మించే ఇళ్లల్లో వాతావరణం చాలా చల్లగా ఉంటుంది. బయటికి, లోపలికి మధ్యన 8 డిగ్రీల ఉష్ణోగ్రత తక్కువగా ఉంటుంది. లోపలికి వేడి, తేమ రాదు. బయట జోరున వర్షం కురుస్తున్నా లోపలికి నీటి బొట్టు కూడా ప్రవేశించలేదు. 3 నెలల్లోనే వీటి నిర్మాణాలు పూర్తి అవుతాయి. భవన నిర్మాణ కూలీలతో అంతగా పని కూడా ఉండదు. 60 వేల కుటుంబాలకు రూ.కోటి విలువ చేసే ఇంటి జాగాలు ఇచ్చాం. విశాఖపట్టణం, విజయవాడ, మంగళగిరిలో ఏళ్ల తరబడి ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్న పేదలకు ఇళ్ల పట్టాలను అందజేశాం. వాటి విలువ రూ.52 వేల కోట్లు. ఒక్కో కుటుంబానికి దాదాపు రూ.కోటి విలువ చేసే ఇంటి పట్టాను నయా పైసా ఖర్చు లేకుండా రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చాం' అని అన్నారు.

**మార్చి నాటికి భూవివాదాలు లేని రాష్ట్రంగా ఏపీ**

'వందల ఏళ్ల నాటి భూసమస్యలకు పరిష్కారం తీసుకొస్తున్నాం. గత వైసీపీ ప్రభుత్వం ప్రతీ గ్రామం, ఇంట్లో భూవివాదాలను సృష్టించింది. ల్యాండ్ టైట్లింగ్ యాక్టును తీసుకొచ్చింది. ఇళ్ల పట్టాలపై గొడ్డలిపార్టీ నాయకుడు తన ఫొటోను ముద్రించుకొన్నాడు. వాటన్నింటిని రద్దు చేశాం. రాజ ముద్రతో ఇళ్ల పట్టాలు, పట్టాదారు పాసుపుస్తకాలను సులభతరంగా పొందేలా చేస్తున్నాం. వచ్చే మార్చి నాటికి భూవివాదాలు లేని రాష్ట్రంగా చేయడమే లక్ష్యంగా ముందుకెళుతున్నాం'అని సీఎం అన్నారు.

**2019-24లో అన్నింటా విధ్వంసమే**

'2014-19 మధ్య కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి మంజూరు చేసిన ఇళ్లల్లో 6 లక్షల పక్కా ఇళ్లను వైసీపీ ప్రభుత్వంలో రద్దు చేయించారు. ఇళ్ల పట్టాల పేరుతో పెద్దఎత్తున అవినీతికి పాల్పడ్డారు. వాళ్లు ఇచ్చిన పట్టాలు ఇళ్లు నిర్మించుకోలేని ప్రాంతాల్లో ఉన్నాయి. వారిలో 4 లక్షల మంది పేదలు తమకు వద్దని తిరిగి ఇచ్చేస్తున్నారు. రద్దు చేయించిన 6 లక్షల ఇళ్లను మళ్లీ మంజూరు చేయించి పూర్తి చేసేందుకు అడుగులు వేస్తున్నాం' అని చెప్పారు. 'ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేశాం. పింఛన్ల ద్వారా ఇప్పటికే రూ.76 వేల కోట్లు ఖర్చు చేశాం. దీపం పథకం ద్వారా ఏటా 3 గ్యాస్ సిలిండర్లు, అన్నదాత సుఖీభవతో రైతులకు రూ.20 వేల ఆర్థికసాయం, స్త్రీశక్తితో మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం, తల్లికి వందనం పథకం ద్వారా ప్రతీ విద్యార్థికి రూ.15 వేల నగదును ఏటా అందిస్తున్నాం. ఇది మా నిబద్ధతకు నిదర్శనం. రాయలసీమలో రూ.లక్ష కోట్లతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేస్తున్నాం. రిలయన్స్ వంటి సంస్థ వచ్చి ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌ను ఏర్పాటు చేయబోతున్నది. పట్టిసీమను ప్రారంభించి కృష్ణా డెల్టాను కాపాడాం. ఈ ఏడాది ఎల్‌నినో పరిస్థితుల్లోనూ 60 టీఎంసీల గోదావరి జలాలను ఇక్కడికి తరలించాం. వచ్చే మార్చి నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి ప్రధానమంత్రి మోదీ చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తాం. ఈ ప్రాంతానికి పుష్కలంగా నీరు అందుతుంది. భవిష్యత్తులో నీటి సమస్యే రాదు' అని అన్నారు

**అమరావతితో మెగా సిటీ**

'అమరావతిని ఒక మెగా సిటీగా అభివృద్ధి చేస్తున్నాం. అమరావతిలో విజయవాడ, గుంటూరు, తెనాలి, మంగళగిరి కలిసి ఒక మెగా సిటీగా ఉంటాయి. ఇది దేవతల, ప్రజా రాజధాని. ప్రపంచం మెచ్చుకునే స్థాయిలో అభివృద్ధి చేస్తాం. ఫిబ్రవరి 3వ తేదీన క్వాంటం వ్యాలీ చలామణిలోకి వస్తుంది' అని అన్నారు.

**శివరాజ్ సింగ్ చౌహాన్ ఏపీకీ మామ**

'మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను అక్కడ అంతా మామ అని ముద్దుగా పిలుచుకొంటారు. ఆయన ఎంపీకే కాదు ఏపీకి కూడా మామనే. ఎంపీలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా గెలిచే నేత చౌహాన్. తన హయాం లో నర్మద, షిప్రా, పార్వతి వంటి అనేక నదులను అనుసంధానం చేసి 16లక్షల ఎకరాలకు సాగునీరందించారు. ప్రజా సమస్యలపై పోరాడి వాటిని పరిష్కరించారు. అందుకే ఆయన్ను ప్రజలు గెలిపిస్తున్నారు. 1.30 లక్షల కోట్లు ఖర్చు చేసి ప్రతి గ్రామాన్నీ ఆదర్శ ప్రాయంగా చేశారు' అని చంద్రబాబు ప్రశంసించారు.

**బుర్రిపాలెం పొలిటికల్ హీరో పెమ్మసాని**

'బుర్రిపాలెం అనగానే మనందరికి గుర్తుకొచ్చేది దివంగత సినీ హీరో సూపర్‌స్టార్ కృష్ణ. తేనెమనసులు సినిమాతో వచ్చి తిరుగులేని హీరోగా ఎదిగారు. ఇప్పుడు కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పొలిటికల్ హీరోగా ఎదుగుతున్నారు. ఎన్నికలకు ముందు అమెరికా నుంచి వచ్చారు. ప్రజలతో అల్లుకుపోగలరా అన్న అనుమానం ఉండేది. ఈ రోజున అందరితో మమేకమై దూసుకెళుతున్నారు' అని ప్రశంసించారు.



# మహిళా జర్నలిస్టులపై ఢిల్లీ పోలీసుల లైంగిక వేధింపులు!

(మొదటిపేజీ తరువాయి)

పురుష పోలీసులు అరెస్టు చేయటాన్ని ప్రశ్నించినందుకు ఆయన తనతో దురుసుగా ప్రవర్తించి అనుచితంగా తాకారని తెలిపారు. తమపై వేధింపులకు పాల్పడిన పోలీసులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పార్లమెంటు స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌లో వారు ఆదివారం ఫిర్యాదు చేశారు. కాక్రోచ్ జనతాపార్టీ (సీజేపీ), ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం కూడా ఇలాంటి ఆరోపణలే చేశాయి. జర్నలిస్టులతోపాటు మహిళా న్యాయవాదులు, ఉద్యమకారులతో కూడా పోలీసులు అనుచితంగా ప్రవర్తించారని ఆరోపించాయి. అయితే, ఎఫ్ఐఆర్ నమోదుకు పోలీసులు నిరాకరించారు. దీంతో, బాధితులతోపాటు వందలమంది జర్నలిస్టులు పోలీస్ స్టేషన్ ముందు దాదాపు మూడు గంటలపాటు ధర్నా నిర్వహించారు. వారికి సీజేపీ నేతలు, కార్యకర్తలు కూడా తోడవటంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. జర్నలిస్టులతోపాటు సీజేపీ, ఇతర ప్రజాసంఘాల నిరసనతో పోలీసులు దిగివచ్చారు. ముగ్గురు మహిళా జర్నలిస్టులు ఇచ్చిన ఫిర్యాదులను క్రైమ్‌బ్రాంచ్‌కి బదిలీ చేశామని ఎక్స్‌లో తెలిపారు.

నిరసనల సమయంలో పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని పేర్కొంటూ గుర్తు తెలియని వ్యక్తులపై మూడు ఎఫ్ఐఆర్‌లను నమోదు చేసినట్లు కూడా మరో ప్రకటనలో పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా, పోలీసుల అనుచిత ప్రవర్తనకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమాధానం చెప్పాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. మహిళలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులే వారిపై వేధింపులకు పాల్పడుతున్నారని కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి ప్రియాంకాగాంధీ మండిపడ్డారు.

# సంపాదకీయం

## మిడ్-ఎయిర్ డ్రామా



**దు**బాయ్ నుండి టెల్ అవీవ్‌కు బయలుదేరిన ఫ్లైదుబాయ్ విమానంలో ఆకాశంలోనే ఊహించని విధంగా అత్యంత నాటకీయమైన, తీవ్ర భయాందోళనకరమైన సన్నివేశం చోటుచేసుకుంది. ఇస్రాయెల్ ప్రయాణికులతో నిండిన ఈ విమానాన్ని కూల్చివేసేందుకు ఓమన్ దేశానికి చెందిన కో- పైలట్ యత్నించడం సంచలనం సృష్టించింది. తీవ్ర మత తీవ్రవాద భావజాలం కలిగిన ఈ ఓమన్ పైలట్, తన తోటి పైలట్‌పై ఒక్కసారిగా దాడికి తెగబడి విమానాన్ని కిందకు దించేందుకు ప్రయత్నించాడు. అతని ఉన్మాద చర్యల కారణంగా విమానం కేవలం 30 సెకన్ల వ్యవధిలోనే ఏకంగా 14,000 అడుగుల కిందకు పడిపోయింది. అలాగే కేవలం రెండు నిమిషాల కంటే తక్కువ సమయంలో మొత్తం 17,000 అడుగుల ఎత్తు నుండి విమానం వేగంగా కిందకు దూసుకుపోవడంతో విమానంలోని ప్రయాణికులు మరణభయంతో అల్లల్లాడిపోయారు. ఈ భయంకరమైన సన్నివేశంలో విమాన పైలట్-ఇన్-కమాండ్, భారతీయ మూలాలున్న కెప్టెన్ స్మిత్ మచ్చర్ అసమాన ధైర్యసాహసాలు ప్రదర్శించారు. సుమారు 13 సంవత్సరాలకు పైగా కమర్షియల్ విమానయాన అనుభవం, దాదాపు 9,750 గంటల ఫ్లయింగ్ రికార్డ్ ఉన్న స్మిత్ మచ్చర్, గతంలో స్పైస్‌జెట్‌లో 11 ఏళ్ల పాటు లైన్ ట్రైనింగ్ కెప్టెన్‌గా సేవలు అందించారు. కో-పైలట్ జరిపిన రక్తసిక్తమైన దాడిలో కెప్టెన్ స్మిత్ తీవ్రంగా గాయపడి, రక్తం ఓడుతున్నప్పటికీ, ఏమాత్రం ఉపేక్షించకుండా కాక్‌పిట్ తలుపులను అన్‌లాక్ చేయడంలో విజయం సాధించారు. విమానం నిటారుగా కిందకు పడిపోతున్న క్లిష్ట సమయంలో ఆయన కాక్‌పిట్ డోర్ తెరవడమే ప్రయాణికుల ప్రాణాలను కాపాడటంలో అతిపెద్ద మలుపుగా మారింది.కాక్‌పిట్ డోర్ తెరచుకోగానే యామివ్ హయూన్ అనే ఇస్రాయెలీ ప్రయాణికుడు తక్షణమే స్పందించి కాక్‌పిట్‌లోకి దూసుకెళ్లాడు. దాడికి తెగబడిన ఓమన్ పైలట్‌ను విమాన నియంత్రణ ప్యానెల్ నుండి వెనక్కి లాగి, ఇతర ప్రయాణికులు మరియు సిబ్బంది సాయంతో అతనిని పూర్తిగా లొంగదీసుకున్నాడు. అనంతరం విమానాన్ని సురక్షితంగా రక్షించి, సౌదీ అరేబియాలో అత్యవసర ల్యాండింగ్ చేశారు. ఈ భయంకర సంఘటనలో కాక్‌పిట్ మొత్తం రక్తసిక్తమైనట్లు ప్రయాణికులు తెలిపారు. ఈ విపత్తు సమయంలో భారతీయ కెప్టెన్ స్మిత్ మచ్చర్ ప్రదర్శించిన అద్భుతమైన సమయస్ఫూర్తి, సాహసాన్ని ఇస్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్వయంగా కొనియాడారు.సహచర పైలట్ల కథనం ప్రకారం, దాడికి పాల్పడిన ఓమన్ పైలట్ ఎనిమిది నెలల క్రితమే ఫ్లైదుబాయ్‌లో చేరాడని, ఆయన తీవ్ర మత తీవ్రవాద భావాలు కలిగిన వ్యక్తి అని వెల్లడైంది. రోజులో విపరీతంగా ప్రార్థనలు చేయడం, మహిళలకు కనీసం షేక్ హ్యాండ్ ఇవ్వడానికి కూడా నిరాకరించడం వంటి ప్రవర్తన అతనిలో కనిపించేదని తెలిసింది. ఈ ఊహించని విమాన ప్రమాద ముప్పుపై ప్రస్తుతం సమగ్ర దర్యాప్తు జరుగుతుండగా, ఫ్లైదుబాయ్ సంస్థ ఇస్రాయెల్‌కు రాకపోకలు సాగించే తన విమాన సేవలను తాత్కాలికంగా నిలిపివేసింది.ఫ్లై దుబాయ్ కంపెనీలో విమానాన్ని నడుపుతున్న భారతీయ పైలట్ స్మిత్ మచ్చార్ మీద ఒమన్ దేశానికి చెందిన కో పైలట్ దాడి చేసి కత్తితో అతడిని పొడిచాడు. అతడు తీవ్రంగా గాయపరుస్తున్నప్పటికీ పైలట్ ఏమాత్రం వెనుకడుగు వేయలేదు. పైగా విమానాన్ని ముందుకు పోనిచ్చాడు. విమానం తలకిందులు అవుతున్నప్పటికీ అతడు ఏమాత్రం వెనకడుగు వేయలేదు. తన ప్రాణాలు పోతాయని తెలిసినప్పటికీ కూడా తోటి ప్రయాణికుల ప్రాణాలను అతని కాపాడాడు.విమానం తలకిందులు కావడం.. అప్పటికే అది సౌదీ అరేబియా గగన తలం మీద ఉంది. అప్పటికే దాని నుంచి అత్యవసర పరిస్థితి అంటూ తబుక్ విమానాశ్రయానికి సంకేతం వచ్చింది. మరికొద్ది నిమిషాల్లోనే కోడ్ 7500 (హైజాక్) అంటూ సందేశం అందింది. ఈ సందేశంతో తీవ్ర కలకలం నెలకొంది. ఇజ్రాయిల్ దేశం మీద ఉగ్రదాడి జరుగుతుందని ప్రచారం మొదలైంది. పైగా విమానంలో ప్రయాణిస్తున్న మెజారిటీ ప్రయాణికులు ఇజ్రాయిల్ దేశానికి చెందినవారు. దీంతో ఇజ్రాయిల్ ప్రధానమంత్రి.. రక్షణ మంత్రి వెంటనే సమావేశం ఏర్పాటు చేశారు. ఇజ్రాయిల్ యుద్ధ విమానాలను రంగంలోకి దింపారు.అప్పటికే కత్తితో దాడి చేసిన కో పైలట్ ను పైలట్.. ప్రయాణికులు పట్టుకున్నారు. తీవ్ర గాయాలైన పైలెట్ కు విమానంలో ఉన్న ఒక వైద్యుడు ప్రాథమికంగా చికిత్స అందించారు. ఆ తర్వాత ప్రయాణికులలో ఇద్దరు ఇతర విమాన పైలట్ల సహాయంతో ఆ విమానాన్ని కిందికి మళ్లించారు. ఆ తర్వాత కోడ్ ను హైజాక్ నుంచి సాధారణ అత్యవసర పరిస్థితికి మార్చారు. పైలట్ పై దాడికి పాల్పడి.. విమానాన్ని కూల్చాలి అనుకున్న ఒమన్ కో పైలెట్ విషయంలో అనేక సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. కొన్ని సంవత్సరాలుగా ఇజ్రాయిల్, ఒమన్ దేశాల మధ్య అంతగా సంబంధాలు లేవు. దీనికి తోడు అరబ్, గల్ఫ్ దేశాల నుంచి ఇజ్రాయిల్ వచ్చే విమానాల మీద తీవ్రస్థాయిలో పరిశీలన ఉంటుంది. అలాంటిది ఇజ్రాయిల్ దేశానికి వెళ్లే విమానంలో పైలట్‌గా ఒమన్ జాతీయుడిని ఎలా అనుమతించారు అనే విషయం మీద అనేక రకాల సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఇజ్రాయిల్ రవాణా శాఖ మంత్రి కూడా ఈ వే సందేహాలను వ్యక్తం చేశారు. విమానం కూల్చడానికి ముందుగానే ప్రణాళిక రూపొందించారని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. అయితే ఒమన్ కో పైలట్ అసలు ఉద్దేశం ఏంటి.. అతని ప్రణాళిక ఏంటి.. దాడికి ఎందుకు ప్రయత్నించాడు అనే అంశాల మీద ఇంతవరకు క్లారిటీ లేదు. ఇతర వెనుక ఎవరైనా ఉన్నారా.. అందుకోసమే ఇదంతా చేశాడా అనే కోణంలో దర్యాప్తు జరుగుతోంది.పైలట్ మీద కత్తి దాడి జరిగిన తర్వాత విమానం తలకిందులుగా ప్రయాణించడం మొదలుపెట్టింది. కేవలం 29 సెకండ్ల కాలంలో 31 వేల అడుగుల ఎత్తులో ప్రయాణిస్తున్న విమానం ఏకంగా 17 అడుగులకు దిగింది. దాదాపు 14 అడుగుల మేర నిలువుగా కిందికి దిగింది. ఆ తర్వాత 19 వేల అడుగులకు చేరుకుంది. ప్రయాణ మార్గాన్ని పూర్తిగా మార్చుకుంది. జోర్డాన్ సరిహద్దుల సమీపంలో అసాధారణమైన రీతిలో తిరిగింది. మళ్లీ వెనక్కి వెళ్ళింది. గంట తర్వాత సౌదీ అరేబియాలోని తబూకు విమానాశ్రయంలో ల్యాండ్ అయింది.

# వేగం పెంచాలి

(మొదటిపేజీ తరువాయి)

అధికారులకు సీఎం పలు కీలక సూచనలు చేశారు. ప్రధాన ఆసుపత్రుల నిర్మాణం, పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎల్బీనగర్, అల్వాల్, వరంగల్, ఉస్మానియా ఆసుపత్రుల పనుల్లో వేగం పెంచాలని సూచించారు. వైద్యులు, ఇతర సిబ్బంది అవసరాల మేరకు నియామక ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. ఆసుపత్రుల నిర్మాణాలు పూర్తయ్యేనాటికి అవసరమైన అత్యాధునిక పరికరాలను కొను గోలు చేసి, అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రాష్ట్రంలోని మిగతా ఆస్పత్రుల్లోనూ వైద్యసిబ్బంది కొరత లేకుండా చూడాలని సీఎం స్పష్టంచేశారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పాఠశాలలను సంద ర్శించి విద్య, వసతులపై దృష్టి సారించాలని, అవసరమైన చోట మరమ్మతులు చేపట్టాలని సీఎం పేర్కొన్నారు. డిసెంబర్‌లో భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించ తలపెట్టిన తెలంగాణ గ్లోబల్ సమ్మిట్- 2026 ఏర్పాట్లపైనా సీఎం సమీక్షించారు.

సదస్సు విజయవంతానికి పటిష్ట ప్రణాళికలు సిద్ధం చేయాలని, త్వరలోనే ఏర్పా ట్లను పరిశీలిస్తానని పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్, సీఎంవో ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సింగీతం శ్రీనివాసరావు మృతిపై సీఎం రేవంత్ సంతాపం

ప్రముఖ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు మృతిపై తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణం తెలుగు చిత్రపరిశ్రమతో పాటు భారతీయ సినీ రంగానికి తీరని లోటని సీఎం పేర్కొన్నారు. వైవిధ్యమైన కథాంశాలు, వినూత్న ఆలోచనలను తెరపై ఆవిష్కరించిన సృజనాత్మక దర్శకుడిగా సింగీతం శ్రీనివాసరావు సేవలను సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. తెలుగు సినిమాకు కొత్త దారులు చూపుతూ ఎన్నో ప్రయోగాలు చేశారని తెలిపారు. పథకాలు చూడండి

ప్రయోగాత్మక చిత్రాలతో సినీ చరిత్రలో తనదైన ముద్ర వేసిన దర్శకుడిగా సింగీతం ప్రత్యేక గుర్తింపు పొందారని సీఎం అన్నారు. సంప్రదాయ కథనాలకు భిన్నంగా కొత్త తరహా కథలు, ఆలోచనలను ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చారని పేర్కొన్నారు. దర్శకుడిగానే కాకుండా రచయితగా, ఆలోచనా పరుడిగా సింగీతం శ్రీనివాసరావు సినీ రంగానికి అందించిన సేవలు చిరస్మరణీయమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన సృజనాత్మకత , ప్రయోగాత్మక దృక్పథం తెలుగు సినిమా అభివృద్ధిలో ప్రత్యేక పాత్ర పోషించాయని తెలిపారు. సింగీతం శ్రీనివాసరావు మృతి సినీ ప్రపంచానికి తీరని లోటని సీఎం అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు, అభిమానులకు, సినీ కళాభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సింగీతం ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

# గ్రేటర్ ఎన్నికలపై ఆచితూచి అడుగులు

**హైదరాబాద్ - సూర్య వాస్తవం**




ఖైరతాబాద్ శాసనసభ స్థానానికి ఉపఎన్నిక అనివార్యమైంది. సుప్రీంకోర్టు తీర్పుతో ఖైరతాబాద్ ఉపఎన్నికల కౌంట్‌డౌన్ ప్రారంభం కాగా, రాజ్యాంగ నిబంధనల ప్రకారం ఆరు నెలల వ్యవధిలోనే ఇక్కడ ఎన్నికలు పూర్తి కావాల్సి ఉంది. అయితే ఖైరతాబాద్‌తో పాటు విస్తృతమైన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ వ్యాప్తంగా స్థానిక సమరానికి ఎందుకు ముహూర్తం ఖరారు కావడం లేదనేది ఇప్పుడు హైదరాబాద్ రాజకీయాల్లో ఆసక్తికరమైన చర్చగా మారింది. జీహెచ్ఎంసీ పాలకమండలి పదవీకాలం ఫిబ్రవరిలోనే ముగిసినప్పటికీ, ప్రభుత్వం మున్సిపల్ ఎన్నికల వైపు వేగంగా అడుగులు వేయకపోవడం వెనుక పలు రాజకీయ, పరిపాలనాత్మక కారణాలు ఉన్నాయి.గ్రేటర్ పాలనను మరింత వేగవంతం చేసేందుకు జీహెచ్ఎంసీని మూడు మున్సిపల్ కార్పొరేషన్లు హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరిగా విభజించారు. ఈ విభజన తదుపరి పునర్విభజన , వార్డుల సంఖ్య పెంపు, బీసీ రిజర్వేషన్లపై కోర్టుల్లో నడుస్తున్న వివాదాలు ప్రభుత్వం ముందుకు రాకుండా అడ్డంకిగా మారాయి. ఖైరతాబాద్ ఉపఎన్నిక ఎలాగూ తప్పదు కాబట్టి, అదే ఊపులో గ్రేటర్ ఎన్నికలను కూడా నిర్వహించి ముగించేస్తే ఒక పని అయిపోతుందనే ప్రతిపాదన ఉన్నప్పటికీ, కాంగ్రెస్ నాయకత్వం మాత్రం అత్యంత జాగ్రత్తగా అడుగులు వేస్తోంది. నిజానికి గ్రేటర్ పరిధిలో ఇప్పటివరకు జరిగిన రెండు అసెంబ్లీ ఉపఎన్నికల్లోనూ కాంగ్రెస్ జయకేతనం ఎగురవేసింది. ఈ వరుస విజయాలు అధికార పార్టీకి మంచి మైలేజ్ ఇచ్చాయనడంలో సందేహం లేదు. అయినప్పటికీ గ్రేటర్ కార్పొరేషన్ స్థానిక పోరు విషయంలో కాంగ్రెస్ పార్టీ నాయకత్వం ఎందుకు సందేహిస్తోంది? మొదటిది, అసెంబ్లీ లేదా పార్లమెంట్ ఉపఎన్నికల సరళి వేరు, మున్సిపల్ వార్డు స్థాయి ఎన్నికల సరళి వేరు. కార్పొరేటర్ల స్థాయి పోరులో స్థానిక సమస్యలు, తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, మూసీ పునరుజ్జీవన పథకం వల్ల ప్రభావితమైన నిర్వాసితుల అసంతృప్తి నేరుగా ఓటింగ్‌పై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన కొన్ని ఆక్రమణల తొలగింపు కార్యక్రమాలు గ్రేటర్ పరిధిలోని మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి వర్గాల్లో కొంత కలకలం రేపాయి.

ఈ పరిస్థితుల్లో ముందస్తుగా గ్రేటర్ ఎన్నికలకు వెళ్తే అది ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలకు కలిసివస్తుందేమోననే భయం కాంగ్రెస్ స్థానిక నేతల్లో ఉందనే ప్రచారం ఉంది.రెండవది, కాంగ్రెస్‌కు హైదరాబాద్ నగర పరిధిలో ఉన్న బలమైన కేడర్ కొరత. గతంలో ఎంఐఎమ్, బీఆర్ఎస్‌లకు గ్రేటర్‌లో పక్కా యంత్రాంగం ఉంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇతర పార్టీల నుంచి కొంతమంది విలీనమైనప్పటికీ, వార్డు స్థాయిలో 300 వార్డుల పరిధిలో సరైన అభ్యర్థులను నిలబెట్టి గెలిపించుకోవడం కాంగ్రెస్‌కు ఐక్యతాపరంగా పెద్ద సవాలుగా మారనుంది. పార్టీ అంతర్గత విభేదాలు బయటపడితే గ్రేటర్ గెలుపుపై ప్రభావం పడుతుందనే యోచనలో నాయకత్వం ఉంది. ఖైరతాబాద్ ఉపఎన్నిక ఫలితం కాంగ్రెస్‌కు లిట్మస్ టెస్ట్‌గా మారబోతోంది. ఒకవేళ ఖైరతాబాద్‌లో దానం నాగేందర్ , కాంగ్రెస్ అభ్యర్థి భారీ మెజారిటీతో విజయం సాధిస్తే, ఆ పొలిటికల్ వేవ్‌ను వాడుకుని తక్షణమే గ్రేటర్ కార్పొరేషన్ ఎన్నికలకు నోటిఫికేషన్ ఇచ్చే అవకాశాలను ప్రభుత్వం పరిశీలిస్తోంది. అప్పటివరకు న్యాయస్థానాల్లో ఉన్న లీగల్ అడ్డంకులను క్లియర్ చేసి, వార్డుల రిజర్వేషన్లను ఖరారు చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించింది.రాబోయే 3 నుంచి 4 నెలల్లో ఖైరతాబాద్ ఉపఎన్నికతో పాటు గ్రేటర్ సమరంపై రేవంత్ రెడ్డి సర్కార్ ఒక స్పష్టమైన నిర్ణయానికి రాక తప్పదు.

# జనసేన వైపు వైసీపీ ద్వితీయ శ్రేణి నేతలు

**విజయవాడ- సూర్య వాస్తవం :**




ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కి చెందిన ముఖ్య నాయకులు, మాజీ ఎమ్మెల్యేలు, ద్వితీయ శ్రేణి ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున జనసేన పార్టీ వైపు క్యూ కడుతున్నారు. పవన్ కళ్యాణ్ నాయకత్వంపై నమ్మకంతో పాటు, ఏపీ సర్కార్‌లో ఉప ముఖ్యమంత్రిగా ఆయన పెంచుకున్న రాజకీయ గ్రాఫ్ ఈ చేరికలకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ప్రతిపక్షం నుంచి నాయకులు వరుసగా వచ్చి చేరుతుండటం వల్ల జనసేనకు రాజకీయంగా కొత్త ఊపు, ఒక బలమైన పొలిటికల్ మూమెంటం లభిస్తోంది. అయితే, ఈ చేరికలు పార్టీని నిజంగా ఒక ప్రధాన ప్రత్యామ్నాయ శక్తిగా మారుస్తాయా? లేక కేవలం తాత్కాలిక హడావుడికే పరిమితమవుతాయా ? ఏ రాజకీయ పార్టీకైనా నాయకులు, కేడర్ వరుసగా రావడం అనేది ప్రజాక్షేత్రంలో సానుకూల వాతావరణాన్ని సృష్టిస్తుంది. వైఎస్సార్‌సీపీ నుంచి నేతలు జనసేనలోకి రావడం ద్వారా రాష్ట్రంలో భవిష్యత్తు జనసేనదే అన్న అభిప్రాయం ప్రజల్లోనూ, రాజకీయ వర్గాల్లోనూ బలపడుతోంది. ఇది పార్టీ ఇమేజ్‌ను పెంచడానికి, ద్వితీయ శ్రేణి కార్యకర్తల్లో ఉత్సాహం నింపడానికి ఉపయోగపడుతుంది. ఈ చేరికల వల్ల రాజకీయ మూమెంటం వచ్చినప్పటికీ, జనసేన ప్రస్తుతం టిడిపి-జనసేన-బీజేపీ అధికార కూటమి లో భాగంగా ఉంది. ఒక పార్టీ అధికార కూటమిలో ఉంటూ సొంతంగా ప్రధాన ప్రతిపక్ష స్థానాన్ని, స్వతంత్ర ప్రత్యామ్నాయ శక్తిని ఆక్రమించడం సాధ్యం కాదు. ప్రభుత్వం సాధించే విజయాల్లో భాగస్వామ్యంతో పాటు, ప్రభుత్వ వ్యతిరేకత వస్తే దాని ప్రభావం కూడా జనసేనపై పడుతుంది. అందువల్ల ఎంతమంది నాయకులు చేరినా, కూటమి పరిధిలోనే పవన్ కళ్యాణ్ రాజకీయం చేయాల్సి ఉంటుంది.ఎంతమంది వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యేలు , దిగ్గజ నాయకులు జనసేన కండువా కప్పుకున్నా, ఎన్నికల సమయానికి వచ్చేసరికి పొత్తుల ధర్మం ప్రధాన అడ్డంకిగా మారుతుంది. కూటమి ఒప్పందం ప్రకారం జనసేనకు పరిమిత సంఖ్యలోనే స్థానాలు దక్కే అవకాశం ఉంటుంది. దాంతో, కొత్తగా చేరిన సీనియర్ నేతలందరికీ టికెట్లు కేటాయించడం పవన్ కళ్యాణ్‌కు కత్తిమీద సాములా మారుతుంది. టికెట్లు దక్కని నాయకులు మళ్లీ అసంతృప్తికి గురై పార్టీ మారే లేదా తిరుగుబాటు చేసే ప్రమాదం కూడా ఉంది. జనసేనలో ఈ చేరికలు పూర్తి స్థాయిలో ఉపయోగపడాలంటే, ఆ పార్టీ భవిష్యత్తులో కూటమి నుంచి బయటకు వచ్చి ఒంటరిగా పోటీ చేసే పరిస్థితి కి ఎదగాలి. కూటమికి అతీతంగా, రాష్ట్రంలో ముఖ్యమంత్రి పీఠం లక్ష్యంగా జనసేన ఒక స్వతంత్ర రాజకీయ శక్తిగా మారినప్పుడే ఈ నేతల చేరికలు నిజమైన సీట్లుగా, ఓట్లుగా మారతాయి. లేకపోతే, టీడీపీ కేటాయించే కొన్ని సీట్లతోనే సరిపెట్టుకోవాల్సి వస్తుంది.మరో కీలకమైన అంశం ఏంటంటే.. మొదటి నుంచీ పవన్ కళ్యాణ్ వెంట ఉండి, పార్టీ కోసం కష్టపడిన జనసైనికులు , సిద్ధాంతపరమైన కార్యకర్తలు ఉన్నారు. ఇప్పుడు వైఎస్సార్‌సీపీ నుంచి వస్తున్న నాయకులు ఎక్కువ భాగం అధికారంలో ఉండగా ప్రయోజనాలు పొందినవారే. అకస్మాత్తుగా పార్టీలోకి వచ్చిన కొత్త నాయకులకు ప్రాధాన్యత ఇస్తే, పాత కేడర్‌లో అసంతృప్తి రగిలే అవకాశం ఉంది. ఈ పాత-కొత్త నేతల మధ్య సమన్వయం కుదర్చడం జనసేన అధిష్టానానికి పెద్ద పరీక్షగా మారనుంది వైఎస్సార్‌సీపీ నుంచి జనసేనలోకి వరుస చేరికలు పార్టీ వృద్ధికి మంచి సంకేతమే అయినా, అది కేవలం పొలిటికల్ మూమెంటం వరకే పరిమితమవుతుంది. పవన్ కళ్యాణ్ తన పొత్తుల వ్యూహాన్ని, భవిష్యత్ రాజకీయ ప్రణాళికను స్పష్టంగా రూపొందించుకుంటే తప్ప, ఈ నాయకుల బలం సీట్ల రూపంలోకి మారడం కష్టం. కూటమి పరిమితులను దాటుకొని జనసేన తన సొంత జెండాపై ఏ మేర అధికారాన్ని డిమాండ్ చేయగలదనే దానిపైనే ఈ చేరికల అసలు ఫలితం ఆధారపడి ఉంటుంది.

## నింబగల్లు ఎస్ఎస్ ట్యాంక్ గట్టు తెగి తాగునీరు వృథా!

**- లీకేజీలను పట్టించుకోకపోవడంతోనే గట్టు కోతకు గురైందని రైతుల ఆరోపణ**



**ఉరవకొండ - సూర్య వాస్తవం :** ఉరవకొండ మండలంలోని నింబగల్లు వద్ద గ్రామీణ నీటి సరఫరా (ఆర్డబ్ల్యూఎస్) శాఖకు చెందిన సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ (ఎస్ఎస్ ట్యాంక్) గట్టు తెగిపోవడంతో భారీగా తాగునీరు వృథా అవుతోంది. ఇక్కడ ఉన్న మూడు ట్యాంకుల్లో మూడో ట్యాంక్ గట్టు కోతకు గురై తెగిపోవడంతో నిల్వ నీరు బయటకు ప్రవహిస్తోంది.గత కొంతకాలంగా గట్టు వెంట నీటి లీకేజీలు కనిపిస్తున్నప్పటికీ ఆర్డబ్ల్యూఎస్ అధికారులు తగిన చర్యలు తీసుకోలేదని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. ట్యాంక్ పూర్తిస్థాయిలో నిండిన సమయంలో గట్టుపై అవసరమైన పర్యవేక్షణ, ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే గట్టు బలహీనపడి తెగిపోయిందని వారు వాపోతున్నారు.గట్టు తెగిపోవడంతో నీరు పొలాల్లోకి చేరి పంటలు నీట మునిగాయని బాధిత రైతులు చెబుతున్నారు. ఆర్డబ్ల్యూఎస్ అధికారుల పర్యవేక్షణ లోపమే ఈ పరిస్థితికి కారణమని ఆరోపిస్తూ, నష్టపోయిన పంటలకు తగిన పరిహారం అందించాలని వారు కోరు తున్నారు. ఉరవకొండ పట్టణంతో పాటు మరో ఏడు గ్రామాలకు సాధారణ రోజుల్లోనే కాకుండా వేసవిలోనూ తాగునీటి సరఫరాకు ఈ ఎస్ఎస్ ట్యాంకుల్లో నిల్వ చేసే నీరే ప్రధాన ఆధారం. ఇలాంటి కీలకమైన తాగునీటి వనరుల విషయంలో అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టి, గట్టు మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

## అఖిల భారతీయ స్థాయిలలో సాయిప్రణీత్‌కు ప్రథమ స్థానం



**పామిడి - సూర్య వాస్తవం :** స్థానిక పట్టణంలోని శ్రీసరస్వతీ విద్యామందిరం ఉన్నత పాఠశాల విద్యాభారతి అఖిల భారతీయ శిక్షా సంస్థాన్ ఆధ్వర్యంలో అక్టోబర్ 2 నుండి 4 తేదీలలో నూతక్కిలో నిర్వహించిన క్షేత్రస్థాయి (ఆంధ్ర,తెలంగాణ,కర్ణాటక) పాల్గొనగా గణిత విజ్ఞాన, సంస్కృతి మహోత్సవంలో గణిత ప్రయోగాలు అంశములో ప్రథమ స్థానం సాధించి అఖిల భారతీయ స్థాయికి ఎంపిక అయిన కె.సాయిప్రణీత్ 10వ తరగతి విద్యార్థికి, గణిత పత్ర సమర్పణలో ద్వితీయస్థానం సాధించిన మహిధరరెడ్డి, అలాగే 10వ తరగతి సైన్స్ మోడల్స్ లో ద్వితీయస్థానం సాధించిన శ్రీబాలజి 9వ తరగతి, ప్రతిభను కనబడుచుటకు ప్రధాన కారకులైన విద్యార్థులకు సహకరించిన తల్లితండ్రులకు, ఉపాధ్యాయులకు పాఠశాల ప్రధానాచార్యులు సి. ఆర్. శ్రీనివాసన్, ప్రబంధకారిణి అధ్యక్షులు జె. శ్రీనివాస రావు కార్యదర్శి బి.వి.రత్నమయ్య ప్రత్యేకంగా అభినందించారు.

## జూనియర్ కళాశాల లెక్చరర్స్ అసోసియేషన్ ఎన్నికల్లో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ ప్రభాకర్, పి.ప్రమీల ఏకగ్రీవం




**తనకల్లు - సూర్య వాస్తవం :** ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నికలో ఏకగ్రీవం ధర్మవరం ప్రభుత్వ బాలురు జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నుకున్న శ్రీ సత్యసాయి జిల్లా.తనకల్లు ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం జూనియర్ లెక్చరర్స్ జిల్లా కార్యవర్గంలో ఖాళీ అయిన పదవులకు ఆదివారం ఎన్నికలు నిర్వహించారు. జూనియర్ లెక్చరర్లు డిగ్రీ లెక్చరర్లుగా పదోన్నతులు పొందడంతో ఏర్పడిన ఖాళీలను భర్తీ చేసేందుకు ఈ ఎన్నికలు నిర్వహించినట్లు ఎన్నికల అధికారి తెలిపారు. ఈ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా జి. శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడిగా ఎం. అబ్దుల్ రషీద్, కార్యదర్శిగా టి. గీత, సంయుక్త కార్యదర్శిగా కె. హమీదుద్దీన్ బాబా, హిస్టరీ లెక్చరర్ కోశాధికారిగా ఎస్. ప్రభాకర్, ఎకనామిక్స్ మహిళా కార్యదర్శిగా పి. ప్రమీలా, స్టేట్ కౌన్సిలర్‌గా వి. సుమన్లాల్ నాయక్ ఎన్నికయ్యారు. ఎన్నికల ప్రక్రియను అనంతపురం జిల్లా అధ్యక్షుడు, ఎన్నికల అధికారి జి. నారాయణ స్వామి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులకు పలువురు అభినందనలు తెలిపారు.




# విధులకు డుమ్మా.. ముగ్గురు వైద్యులపై వేటు!

## - ఎస్వీ మెడికల్ కాలేజీ పరిధిలో ఉన్నతాధికారుల కఠిన చర్యలు




**తిరుపతి వైద్యం - సూర్య వాస్తవం :** తిరుపతి విధులకు దీర్ఘకాలంగా అనధికారికంగా గైర్హాజరవుతున్నారన్న ఆరో పణల నేపథ్యంలో ఎస్వీ మెడికల్ కాలేజీ పరిధిలో పనిచేస్తున్న ముగ్గురు వైద్యులపై ఉన్నతాధి కారులు కఠిన చర్యలు తీసుకున్నట్లు సమాచారం. అనుమతి లేకుండా సుదీర్ఘకాలం విధులకు హాజరు కాలేదన్న కారణంతో వారిని విధుల నుంచి తొలగిం చినట్లు తెలుస్తోంది. మెటర్నిటీ ఆస్పత్రి గైనకాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. యమున, రుయా ఆస్పత్రి మెడిసిన్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డా. ప్రతాప్, పెథాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. దివ్యాసాయిపై అధికారులు చర్యలు తీసుకున్నట్లు సమాచారం.విధులకు హాజరు కాకపోవడంపై ఉన్నతాధికారులు పరిశీలన జరిపిన అనంతరం ఈ చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇంకా కొందరు వైద్యులు, ఉద్యోగులు కూడా దీర్ఘకాలంగా అనధి కారికంగా విధులకు గైర్హాజరవుతున్నట్లు గుర్తిస్తే వారిపైనా చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం.

**అనంతపురంలోనూ దృష్టి సారించాలన్న ప్రజల ఆకాంక్ష**

తిరుపతిలో వైద్యుల గైర్హాజరుపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్న నేపథ్యంలో అనంతపురంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రి, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లోని సిబ్బంది హాజరు, విధుల నిర్వహణపై కూడా సమగ్రంగా దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. కొందరు వైద్యులు, కిందిస్థాయి ఉద్యోగుల పనితీరుపై కూడా పరిశీలన జరిపి, విధుల్లో నిర్లక్ష్యం ఉంటే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

# ఆత్మీయ తేనీటి విందులో... రాజకీయ ప్రముఖుల భేటీ...!

- రాయల్ మురళి ఆహ్వానం మేరకు నివాసంలో ప్రత్యేక సమావేశం
- షకిల్ సఫీతో పాటు పలువురు రాజకీయ, సామాజికవర్గ ప్రముఖుల హాజరు
- తేనీటి విందు వేదికగా కీలక అంశాలపై చర్చలు





**అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం :** అనంతపురం కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రాయల్ మురళి ఆహ్వానం మేరకు అనంతపురంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ తేనీటి విందులో రాష్ట్ర ముతవల్లిల సంఘం అధ్యక్షులు కె.యం. షకిల్ సఫీ పాల్గొన్నారు.ఈ సందర్భంగా గంటా రవితేజ, రాయల్ మురళి, కె.యం. షకిల్ సఫీ, టౌన్ బ్యాంక్ చైర్మన్ జె.ఎల్. మురళి, ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ సభ్యులు పి. వెంకటప్ప, ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కాటప్పగారి రామలింగారెడ్డి, కాయగూరల లక్ష్మీపతి, టీడీపీ కార్యాలయ కార్యదర్శి తాజ్, ఐ.ఎం.ఎం. బాషా తదితరులు పాల్గొన్నారు. రాజకీయ ప్రముఖులు, సామాజి కవర్గ పెద్దలు, మిత్రులు ఆత్మీయంగా సమావేశమై పలు సామాజిక, రాజకీయ అంశాలపై తమ అభిప్రాయాలను పరస్పరం పంచుకున్నారు. సమావేశం స్నేహపూర్వక వాతావరణంలో కొనసాగింది.

## జిల్లా వ్యాప్తంగా... పోలీసుల విస్తృత వాహన తనిఖీలు...!

**- హెల్మెట్, సీటుబెల్ట్ లేకుండా ప్రయాణిస్తే చర్యలు..**
**- మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని పోలీసుల సూచన**





**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా ఎస్పీ పి. జగదీష్, ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. అనంతపురం నగరంతో పాటు అన్ని మున్సిపాలిటీలు, మండల కేంద్రాలు, జాతీయ, రాష్ట్ర రహదారుల ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాల్లోని ముఖ్య కూడళ్ల వద్ద ప్రత్యేక తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా ద్విచక్ర వాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీటుబెల్ట్ ధరించాలని పోలీసులు సూచించారు. వాహనం నడుపుతున్న సమయంలో సెల్‌ఫోన్ వినియోగించడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం వంటి ఉల్లంఘనలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న ఆటోరిక్షాలు, వాణిజ్య సరుకు రవాణా వాహనాల్లో ప్రయాణికులను తరలిస్తున్న వాహనాలపై కూడా చర్యలు చేపట్టారు. అతివేగం, సెల్‌ఫోన్ డ్రైవింగ్, ఆటోల్లో సైడ్ సిట్టింగ్, ట్రిపుల్ రైడింగ్, ఓవర్‌లోడింగ్, మద్యం సేవించి వాహనం నడపడం తదితర ఉల్లంఘనలకు పాల్పడిన వారికి జరిమానాలు విధించారు.మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పోలీసులు సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. రోడ్డు భద్రతా నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## పాత నేర పంథా వీడాల్సిందే!

**- రౌడీషీటర్లకు పోలీసుల వార్నింగ్.. పంథా మార్చుకోకుంటే చర్యలు!**
**- ఎస్పీ పి.జగదీష్ ఆదేశాలతో జిల్లావ్యాప్తంగా కౌన్సెలింగ్**
**- అల్లర్లు, అలజడులు సృష్టిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం**

**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా రౌడీషీటర్లకు పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. పాత నేర పంథాను పూర్తిగా వీడి సత్ప్రవర్తనతో జీవించాలని అధికారులు సూచించారు.జిల్లాలోని రౌడీషీటర్లు ఇకపై ఎలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకుండా శాంతియుతంగా జీవించాలని పోలీసులు స్పష్టం చేశారు. ఈ మేరకు సంబంధిత పోలీసు అధికారులు రౌడీషీటర్లను పిలిపించి వారి ప్రవర్తనపై కౌన్సెలింగ్ ఇస్తున్నారు. నేరాలకు దూరంగా ఉండి కుటుంబ సభ్యులతో ప్రశాంత జీవనం సాగించాలని సూచిస్తున్నారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ఏమాత్రం సహించేది లేదని హెచ్చరించారు. పాత నేరాలను పునరావృతం చేయడం, అల్లర్లు లేదా అలజడులు సృష్టించడం, ప్రజలకు ఇబ్బందులు కలిగించడం వంటి చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.చట్టాన్ని గౌరవిస్తూ సత్ప్రవర్తనతో మెలిగితే సాధారణ జీవితం గడపవచ్చుని, నేరాలకు పాల్పడితే మాత్రం పోలీసుల నిఘా, చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.



## నిత్య అన్నదాన ప్రసాదశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన మఠాధిపతులు శ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వామి



బ్రహ్మంగారిమఠం- సూర్య వాస్తవం : జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి నిత్య అన్నదాన ప్రసాదశాలను మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వీరధర్మజ వెంకటాద్రి స్వాముల వారు ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అన్నదాన ప్రసాదశాలలో భోజనం చేస్తున్న భక్తులను స్వామివారు నేరుగా పలకరించి, భోజనం ఎలా ఉందో అడిగి తెలుసు కున్నారు. భక్తులకు రుచికరమైన కూరలు, నాణ్యమైన భోజనం వడ్డించాలని వంట సిబ్బందికి సూచించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అన్నదాన ప్రసాద శాలలో భక్తుల సౌకర్యార్థం చల్లటి మినరల్ వాటర్‌ను కూడా అందిస్తున్నట్లు తెలిపారు. అన్నదాన కార్యక్ర మంలో పరిశుభ్రత, నాణ్యత, భక్తుల సంతృప్తికి ప్రాధా న్యం ఇవ్వాలని మఠాధిపతులు సూచించారు.ం

## తిరుమలకు రాపిడో, ఓలా, ఉబర్ బైక్‌లు నిషేధం!

- టీటీడీ కీలక నిర్ణయం
- అలిపిరి వద్ద 'నాట్ అలౌడ్' బోర్డులు
- యాప్‌లలో తిరుమల ఆప్షన్ తొలగింపునకు చర్యలు




తిరుమల- సూర్య వాస్తవం : శ్రీవారి భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని తిరుమల ఘాట్ రోడ్లలో రాపిడో, ఓలా, ఉబర్ వంటి బైక్ ట్యాక్సీ సర్వీసులను టీటీడీ పూర్తిగా నిషేధించింది. ఇటీవల హైదరాబాద్‌కు చెందిన సునీల్ అనే భక్తుడు శ్రీవారి దర్శనానంతరం తిరుపతి విమానాశ్రయానికి వెళ్లేందుకు రాపిడో బైక్‌ను బుక్ చేసుకున్నారు. ఈ క్రమంలో తిరుమల మొదటి ఘాట్ రోడ్డులోని 26వ మలుపు వద్ద ద్విచక్రవాహనం క్రాష్ బారియర్‌ను బలంగా ఢీకొనడంతో బైకర్ అక్కడికక్కడే దుర్మరణం చెందగా, భక్తుడు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదాన్ని టీటీడీ యాజమాన్యం అత్యంత తీవ్రంగా పరిగణించింది. ఘాట్ రోడ్డులో భక్తుల ప్రాణాలకు రక్షణ కల్పించాలనే ఉద్దేశంతో వాణిజ్య బైక్ రైడ్లను తిరుమలకు అనుమతించకూడదని నిర్ణయించారు. ఈ మేరకు అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద 'నాట్ అలౌడ్' పేరిట పోస్టర్లను ప్రదర్శించారు. తిరుమల ఘాట్ రోడ్లలో కేవలం వ్యక్తిగత ద్విచక్రవాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందని, యాప్‌ల ద్వారా బుక్ చేసుకునే బైక్‌లను ఎట్టిపరిస్థితుల్లోనూ కొండపైకి రానివ్వబోమని అధికారులు స్పష్టం చేశారు. ఇలాంటి వాహనాల రాకపోకలపై అలిపిరి వద్ద తనిఖీ సిబ్బంది ప్రత్యేక నిఘా పెట్టాలని ఆదేశించారు. మరోవైపు, రైడింగ్ యాప్‌లలో తిరుమల గమ్యస్థాన ఆప్షన్ కనిపించకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత సంస్థలను సంప్రదించేందుకు టీటీడీ కసరత్తు చేస్తోంది.

## బీసీల సంక్షేమానికి

# కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది: ఎమ్మెల్యే కోట్ల

### - బీసీల అభివృద్ధికి అన్ని విధాలా సహకారం అందిస్తాం



డోన్- సూర్య వాస్తవం: డోన్ పట్టణంలోని న్యూ మధు ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్రస్థాయి సమావేశానికి డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం నాయకులు ప్రతినిధులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనం తరం ఎమ్మెల్యే మాట్లాడుతూ. సమాజంలో బీసీలకు ప్రత్యేకమైన స్థానం ఉందని, రాష్ట్ర అభివృద్ధిలో బీసీలు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. బీసీల ఆర్థిక, సామాజిక, విద్యా రంగాల అభివృద్ధికి మరింత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. బీసీ విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు, యువతకు ఉపాధి అవకాశాలు, స్వయం ఉపాధి కోసం ఆర్థిక సహాయం అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. బీసీలలోని ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వెనుకబడిన వర్గాల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. బీసీ సంఘాల నాయకులు తమ ప్రాంతాల్లోని ప్రజల సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. బీసీల హక్కులు, సంక్షేమం, అభివృద్ధి కోసం సంఘాలు ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు. బీసీల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, బీసీ సంఘాలు సమన్వయంతో పనిచేస్తే మరింత మంచి ఫలితాలు సాధించవచ్చని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు, వివిధ బీసీ సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, బీసీ సామాజిక వర్గాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# డయల్-112 సమాచారంపై సత్వర స్పందన

- ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళను ప్రాణాపాయం నుంచి రక్షించిన రైల్వే కోడూరు పోలీసులు.
- ప్రజల భద్రతే లక్ష్యంగా 24/7 అత్యవసర పోలీస్ సేవలు.
- డయల్-112 సమాచారంపై క్షణాల్లో స్పందించిన రైల్వే కోడూరు పోలీసులు.
- రైల్వే స్టేషన్‌కు సకాలంలో చేరుకుని మహిళ ప్రాణాలను కాపాడిన సిబ్బంది.
- కౌన్సెలింగ్ అనంతరం కుటుంబ సభ్యులకు సురక్షితంగా అప్పగింత.
- పోలీసుల సత్వర స్పందనను అభినందించిన జిల్లా ఎస్పీ.



దొరవారిసత్రం- సూర్య వాస్తవం: తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు, ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ శాఖ ప్రజల భద్రత, రక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ 24 గంటలూ అప్రమత్తంగా పనిచేస్తోంది. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు తక్షణ పోలీస్ సహాయం అందించే డయల్-112 సేవల ద్వారా అందే సమాచారంపై పోలీసులు వేగంగా స్పందిస్తూ అవసరమైన సహాయాన్ని అందిస్తున్నారు. ఇందులో భాగంగా రైల్వే కోడూరు పట్టణానికి చెందిన 22 ఏళ్ల మహిళ కుటుంబ సమస్యల కారణంగా రైల్వే కోడూరు రైల్వే స్టేషన్ వద్ద రైలు కిందపడి ఆత్మహత్యకు ప్రయత్నిస్తున్నట్లు డయల్-112 ద్వారా పోలీసులకు అత్యవసర సమాచారం అందింది. సమాచారం అందిన వెంటనే రైల్వే కోడూరు పట్టణ పోలీసులు ఆలస్యం చేయకుండా సంఘటనా స్థలానికి చేరుకుని, మహిళ రైలుకింద పడేలోపే సకాలంలో రక్షించి ప్రాణాపాయం నుంచి కాపాడారు. అనంతరం ఆమెకు కౌన్సెలింగ్ నిర్వహించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారి సమక్షంలో మహిళను సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్ప గించారు. ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ పోలీస్ శాఖ తక్షణ సహాయం అందించేందుకు డయల్-112 సేవలు అందుబాటులో ఉన్నాయి. ఆత్మ హత్యకు ప్రయత్నిస్తున్న వ్యక్తి ఉన్నట్లు తెలిసినా, ప్రమాదం లేదా ఇతర అత్యవసర పరిస్థితి ఎదురైనా ప్రజలు ఎలాంటి ఆలస్యం చేయకుండా డయల్-112 కు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు. సమాచారం అందిన వెంటనే సమీపంలోని పోలీసు సిబ్బంది స్పందించి అవసరమైన సహాయక చర్యలు చేపడతారని తెలిపారు. మహిళ ప్రాణాలను సకాలంలో కాపాడిన రైల్వే కోడూరు పట్టణ పోలీసుల అప్రమత్తత, సత్వర స్పందనను జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, అభినందించారు.

# అంతర్రాష్ట్ర ద్విచక్ర వాహన దొంగల ముఠా గుట్టురట్టు

- 25 లక్షలు విలువ చేసే 24 చోరీ ద్విచక్ర వాహనాలు రికవరీ.. ముగ్గురు నిందితులు అదుపులో.
- తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు తిరుపతి వెస్ట్ పోలీసుల ప్రత్యేక దర్యాప్తు.
- సాంకేతిక ఆధారాలు, విశ్వసనీయ సమాచారంతో ముగ్గురు నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్న పోలీసులు
- నిందితుల నుంచి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన 24 చోరీ ద్విచక్ర వాహనాలు రికవరీ.
- రికవరీ చేసిన 24 వాహనాల్లో 9 వాహనాలకు సంబంధించిన క్రైమ్ నంబర్లతో కేసులు గుర్తింపు
- మిగిలిన 15 వాహనాలకు సంబంధించిన కేసులు, అసలు యజమానుల గుర్తింపు ప్రక్రియ కొనసాగింపు

**తిరుపతి - సూర్య వాస్తవం**

తిరుపతి నగరంలో ద్విచక్ర వాహనాల చోరీలకు అడ్డుకట్ట వేసేందుకు తిరుపతి వెస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక దృష్టి సారించి దర్యాప్తు చేపట్టారు. తిరుపతి ఈాణూూ శ్రీ ఎం. భక్తవత్సలం గారి నిరంతర పర్యవేక్షణలో, తిరుపతి వెస్ట్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వారి నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసి సాంకేతిక ఆధారాలు, విశ్వసనీయ సమాచారాన్ని సమన్వయపరచుకుంటూ దర్యాప్తు నిర్వహించారు. ఈ దర్యాప్తులో ఆరెద్దుల వినోద్ కుమార్ (32), చెర్లోపల్లి గోవిందరాజులు (34), గోవిందస్వామి మురళి (30) లను గుర్తించి అదుపులోకి తీసుకుని వారి నుంచి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల సంబంధించి ఉన్న మొత్తం 24 ద్విచక్ర వాహనాలను రికవరీ చేశారు. రికవరీ చేసిన వాహనాల్లో 9 వాహనాలకు సంబంధించి వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన చోరీ కేసులను క్రైమ్ నంబర్ల ఆధారంగా గుర్తించారు. ఆరెద్దుల వినోద్ కుమార్ పై 21 కేసులు, చెర్లోపల్లి గోవిందరాజులు పై 14 కేసులు, గోవిందస్వామి మురళి పై 17 కేసులు నమోదు అయి ఉన్నాయి, వీరిపై చిత్తూరు జిల్లాలో కూడా పలు కేసులు నమోదు అయి ఉన్నాయి.

మిగిలిన 15 ద్విచక్ర వాహనాలకు సంబంధించిన చోరీ కేసులను గుర్తించడంతో పాటు, వాటి అసలు యజమానులను నిర్ధారించే ప్రక్రియ కొనసాగుతోంది. అలాగే నిందితులు మరిన్ని ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడ్డారా, ఇతర వ్యక్తుల ప్రమేయం ఉందా, ఇతర ప్రాంతాల్లో కూడా ఇలాంటి నేరాలకు పాల్పడ్డారా అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది. సాంకేతిక ఆధారాల వినియోగం, సమర్థవంతమైన దర్యాప్తు, పోలీసు బృందాల సమన్వయంతో చోరీ వాహనాలను గుర్తించి భారీగా రికవరీ చేసినట్లు పోలీసులు తెలిపారు. ప్రజలు తమ ద్విచక్ర వాహనాలను సురక్షిత ప్రదేశాల్లో పార్కింగ్ చేసి, వాహనాలను తప్పనిసరిగా లాక్ చేయాలని పోలీసులు సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాల కదలికలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112 కు సమాచారం అందించాలని కోరారు. ఈ కేసు దర్యాప్తులో విశేష ప్రతిభ కనబరిచి, నిందితులను గుర్తించడంలో మరియు చోరీకి గురైన ద్విచక్ర వాహనాల రికవరీలో కీలకంగా కృషి చేసిన తిరుపతి వెస్ట్ ఇన్‌స్పెక్టర్ శ్రీ రామకృష్ణ, సబ్-ఇన్‌స్పెక్టర్లు శ్రీ హేమాద్రి మరియు శ్రీ సుబ్బారెడ్డి, హెడ్ కానిస్టేబుల్ రాము, కానిస్టేబుళ్లు రవి, చరణ్, నాగార్జున, తిలక్, జ్ఞానేశ్వర్, గిరి మరియు సాంకేతిక సహకారం అందించిన డబ్ల్యుపీసీ శాంతిలను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.






## అంతర్జాతీయ అంతరిక్ష వారోత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ




**దొరవారిసత్రం – సూర్య వాస్తవం:** అంతర్జాతీయ అంతరిక్ష వారోత్సవాలు (వరల్డ్ స్పేస్ వీక్ 2026) పురస్కరించుకుని సూళ్లూరుపేటలో ఆదివారం ఇస్రో ఆధ్వర్యంలో నిర్వహించిన" వాక్ ఫర్ స్పేస్ వీక్ "ర్యాలీలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఆదివారం ఉదయం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణం వద్ద ప్రారంభమైన ఈ నడక కార్యక్రమంలో ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించి, స్వయంగా విద్యార్థులతో కలిసి నడిచారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ మాట్లాడుతూ... అంతరిక్ష రంగంలో భారతదేశం సాధిస్తున్న విజయాలు ప్రపం చానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని కొనియాడారు.దేశానికే గర్వకారణమైన సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ మన సూళ్లూరుపేట నియోజకవర్గ పరిధిలో ఉండటం ఈ ప్రాంత ప్రజలం దరికీ దక్కిన గొప్ప గౌరవమని పేర్కొన్నారు.విద్యార్థులు చిన్నతనం నుంచే శాస్త్రీయ దృ క్పథాన్ని అలవర్చుకుని సైన్స్ మరియు అంతరిక్ష పరిశోధనల పట్ల ఆసక్తి పెంచుకోవాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో దేశ ఖ్యాతిని మరింత ఇనుమడింపజేసే గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఇస్రో ఉన్నతాధికారులు,శాస్త్రవేత్తలు,వివిధ పాఠశాలలు, కళాశాలల ఉపాధ్యాయులు,విద్యార్థినీ విద్యార్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు, యువత పాల్గొన్నారు.

## మృతుని కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ



**దొరవారిసత్రం– సూర్య వాస్తవం:** శ్రీ సిటీ సెజ్‌లోని టిల్ హెల్తకేర్ పరిశ్రమలో జరిగిన బాయిలర్ పేలుడు ప్రమాదంలో తడ మండలంలోని తడకు చెందిన తన్నీరు వాసు మృతి చెందడం అత్యంత బాధాకరంఅని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు.ఆదివారం తడలోని వారి నివాసానికి వెళ్లి తన్నీరు వాసు కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేశాను.వాసు ఆత్మకు శాంతి చేకూరాలని,వారి కుటుంబ సభ్యులకు ఈ తీరని లోటును తట్టుకునే ధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థిస్తున్నానని అన్నారు.

## మృతుడికి నివాళులర్పించిన ప్రముఖులు

**- తిరుపతి డీసీసీ అధ్యక్షులు బాలగురువం బాబు,కేకేసీ చైర్మన్ బాలగురువం చిరంజీవి,సూళ్లూరుపేట ఇంచార్జ్ కిరణ్ కుమార్**



**దొరవారిసత్రం –సూర్య వాస్తవం:** శ్రీసిటీ టీఐఎల్ హెల్త్ కేర్ బాయిలర్ ప్రమాదంలో మృతి చెందిన చెరివికి చెందిన చిన్న మస్తాన్ కుటుంబాన్ని తిరుపతి జిల్లా కాంగ్రెస్ నాయకత్వం పరామర్శించింది.శనివారం జరిగిన బాయిలర్ పేలుడులో 5 గురు మృతి చెందిన విషయం తెలిసిందే.ఇందులో సత్యవేడు మండలం చెరివి గ్రామానికి చెందిన చిన్న మస్తాన్ కూడా ఉన్నారు.ఆయన మృతదేహం వద్దకు తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ డీసీసీ అధ్యక్షులు బాలగురువం బాబు, కేకేసీ చైర్మన్ బాలగురువం చిరంజీవి,సూళ్లూరుపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ డి.కిరణ్ కుమార్ మృతుడు స్వగ్రామానికి వెళ్లి నివాళు లర్పించారు.వారితో పాటు కేకేసీ జనరల్ సెక్రటరీ బి.గురవయ్య,సూళ్లూరుపేట నియోజకవర్గం కార్యదర్శి బొగ్గుల సురేష్,స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా బాలగురువం బాబు మాట్లాడుతూ,బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని,ప్రభుత్వం ప్రకటించిన 50 లక్షల పరిహారం త్వరగా అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.పరిశ్రమల్లో కార్మికుల భద్రతపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు.మృతుడి కుటుంబానికి సంతాపం తెలిపిన నేతలు, ప్రభుత్వం మరింత సహకారం అందించాలని డిమాండ్ చేశారు.

# "ప్రజా దర్బార్‌లో.... ఎమ్మెల్యే నెలవల విజయ శ్రీ"

**- అర్హులైన వారి అందరికీ పెన్షన్లు....ఇంటి స్థలాలు - ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి**



**దొరవారిసత్రం – సూర్య వాస్తవం:** ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి తో పాటు,అభివృద్ధి సంక్షేమమే కూటమి ప్రభుత్వం యొక్క లక్ష్యం,అన్ని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు.ఎమ్మెల్యే ఆదివారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే డా.నెలవల విజయశ్రీ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి,వారి సమస్యలను అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంబంధిత అధికా రులతో మాట్లాడి,సమస్యల పరిష్కారానికి అవ సరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా దర్బార్‌కు ముఖ్యంగా భూ సమస్యలు,ఇళ్ల స్థలాలు, పింఛన్లు,రోడ్లు, డ్రైనేజీలు తదితర సమస్యలపై అర్జీలు వస్తున్నాయని తెలిపారు. అర్హులైన ఎస్సీ,ఎస్టీ కుటుంబాలకు ఇళ్ల స్థలాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.కొత్త పింఛన్ల కోసం వచ్చిన దరఖాస్తుల్లో దాదాపు 90 శాతం పరిశీలన పూర్తయిందని,అర్హులైన వారందరికీ త్వరలో పింఛన్లు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.సంక్షేమ పథకాల విషయంలో ఎవరికీ అన్యాయం జరగకుండా అర్హులందరికీ న్యాయం చేస్తామని పేర్కొన్నారు.ప్రజలు కూటమి ప్రభుత్వంపై నమ్మకంతో ఓట్లు వేశారని,వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అభివృద్ధి,సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామని చెప్పారు.సీఎం ఆర్ ఎఫ్ సహాయం విషయంలో పార్టీలకు అతీతంగా వైద్య సహాయం అవసరమైన అర్హులైన పేద కుటుంబాలకు అండగా నిలుస్తున్నామని తెలిపారు.పల్లె పండుగ 1.0, 2.0 ద్వారా నియోజకవర్గంలోని గ్రామాల్లో అనేక రోడ్లు నిర్మించామని,పల్లె పండుగ 3.0 ద్వారా సుమారు రూ 15 కోట్లతో అన్ని మండలాల్లో మరిన్ని రోడ్ల నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.పట్టణ ప్రాంతాల్లో సుమారు రూ 41 కోట్లతో రోడ్లు, డ్రైనేజీలు తదితర అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందించామని చెప్పారు.దెబ్బతిన్న రోడ్లను కూడా అభివృద్ధి చేసి ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసు కుంటామన్నారు.గతంలో సూళ్లూరుపేట పట్టణంలో చిన్న వర్షం పడినా పలుచోట్ల వర్షపు నీరు నిలిచిపోయే పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం అలాంటి సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని తెలిపారు.డ్రైనేజీ సమస్యలను పరిష్కరించడంతో పాటు పట్టణ సుందరీకరణ పనులు చేపట్టి, సూళ్లూరుపేటను చూడటానికి అందంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు.రాబోయే మూడేళ్లలో మరింత అభివృద్ధి చేసి చూపిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. నాయకులు,కార్యకర్తలు ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరుతూ, నియోజకవర్గ అభివృద్ధి కోసం కష్టపడుతున్న నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు.

# ఎన్నికల భద్రతపై పోలీసుల ప్రత్యేక దృష్టి

- సమస్యాత్మక ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాల క్షేత్రస్థాయి పరిశీలన.
- డ్రోన్ కెమెరాలతో పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో ఏరియల్ సర్వే.
- జిల్లా వ్యాప్తంగా తమ పరిధిలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన పోలీస్ అధికారులు



**దొరవారిసత్రం – సూర్య వాస్తవం:** జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బ రాయుడు, ఆదేశాల మేరకు రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని జిల్లా వ్యాప్తంగా పోలీస్ అధికారులు తమ తమ పరిధిలోని సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక గ్రామాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి భద్రతా పరిస్థితులను సమీక్షించారు.ఇందులో భాగంగా రేణిగుంట డీఎస్పీ వై. శ్రీనివాసరావు, కోడూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి. శ్రీనివాసులుతో కలిసి ఓబులవారిపల్లి,చిట్వేల్, పుల్లంపేట మండలాల్లోని సమస్యాత్మక,అత్యంత సమ స్యాత్మక గ్రామాలను సందర్శించి పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.
**"పోలింగ్ కేంద్రాల వద్ద పరిశీలించిన ప్రధాన అంశాలు":**
-భద్రతా ఏర్పాట్లకు అనుకూల పరిస్థితులు. ప్రహరీ గోడలు విద్యుత్ తాగునీరు మరుగు దొడ్ల సౌకర్యాలు.దివ్యాంగుల కోసం ర్యాంపులు.ప్రవేశ-- నిష్క్రమణ మార్గాలు.వాహనాల రాకపోకలకు అను కూలమైన మార్గాలు. పోలింగ్ కేంద్రాల చుట్టుపక్కల భద్రతాపరమైన పరిస్థితులు.అలాగే డ్రోన్ కెమెరాల సహాయంతో పోలింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాలు, ప్రధాన రహదారులు,రాకపోకల మార్గాలు, భద్రతా పరంగా కీలక ప్రాంతాలను ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించారు.సమస్యాత్మక ప్రాంతాల్లో పరిస్థితులను ముందుగానే అంచనా వేసి,ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ముందస్తు భద్రతా చర్యలను పటిష్టం చేయడమే ఈ పరిశీలన ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు.జిల్లా వ్యాప్తంగా పోలీస్ అధికారులు తమ తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తూ, ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై నిరంతర నిఘా ఉంచుతూ,ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా భద్రతా చర్యలను సమన్వ యంతో అమలు చేస్తున్నారు.



# అధిక ధరలకు కొనలేని స్థితిలో పేదలు

**- సబ్సిడీ సన్న బియ్యం సరఫరాలో చేతులెత్తేసిన రైస్ మిల్లర్ల యాజమాన్యం**



**దొరవారిసత్రం –సూర్య వాస్తవం:** పేద ప్రజలను ఆర్థికపరంగా ఆదుకునే దిశలో అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలు ప్రయోజనకరంగా లేకుండా మూన్నాళ్ళ ముచ్చటగా మారుతుందని పేద ప్రజలు వాపోతున్నారు. పేదల సైతం సన్న బియ్యం అన్నం తినేలా అందరికీ అందుబాటులో సరసమైన ధరలకే ప్రైవేటు మిల్లర్ల ద్వారా సబ్సిడీ ధరలో సరఫరా చేసేందుకు ఆగస్టు మాసంలో పౌర సరఫరాల శాఖ సబ్సిడీ స్కీమును అమలు చేసింది.ఆయా మండలాల పరిధిలో ఉన్న రైస్ మిల్లర్ల యాజమాన్యానికి సన్న బియ్యం సబ్సిడీలు సరఫరా చేయాలని ఆదేశించింది. రాష్ట్రవ్యాప్తంగా 130 రైతు బజార్లతోపాటు,500 రైస్ విక్రయ కేంద్రాలుగా ఏర్పాటు చేశారు కానీ నేడు ప్రభుత్వం కల్పించిన రైస్ మిల్లుల యాజమాన్యం సబ్సిడీ సన్నీ బియ్యం సరఫరా చేయడం లేదు.కిలో బియ్యం ధరలో 10రూ,తగ్గించి రేషన్ కార్డు లబ్ధిదారులకు సరఫరా చేయాలని ఆదేశించింది. సూళ్లూరుపేట నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో ఉన్న రైస్ మిల్లులలో ఆగస్టు మాసంలో నామమాత్రంగా యాజమాన్యం సరఫరా చేశారు. అయితే ఆ సబ్సిడీ పథకం.మూన్నాళ్ళ ముచ్చటగానే మారింది.వరి ధాన్యానికి రేటు పలకడంతో సన్న బియ్యం కు డిమాండ్ పెరిగింది.దీంతో మిల్లర్ల యాజమాన్యం సబ్సిడీ స్కీమును పక్కకు నెట్టేసి, అధిక రేట్లతో అమ్మకాలు ప్రారంభించడమే కాకుండా, వ్యాపార నిమిత్తం పలు పొరుగు రాష్ట్రాలకు సరఫరా చేస్తూ,సబ్సిడీ బియ్యాన్ని తక్కువ ధరకు మేము అందించలేము అన్న రీతిలో సరఫరాను నిలిపివేశారు. నిరుపేదలు పెరిగిన రేట్లకు అనుగుణంగా కిలో 70 నుండి 80 రూపాయలు పెంచడంతో కొనలేని పేదలందరూ సబ్సిడీ బియ్యానికి మిల్లర్ల వద్దకు వెళ్లి సరఫరా లేక అసంతృప్తి వ్యక్తం చేస్తూ తిరుగు ముఖం పడుతున్నారు.దొరవారిసత్రం మండల పరిధిలోని నెలబల్లి గ్రామపంచాయతీలో ఉన్న రైస్ మిల్లులో సబ్సిడీ సన్న బియ్యం సరఫరా లేదంటూ,ఇక సరఫరా చేయలేమంటూ చేతులెత్తేశారు. ప్రభుత్వం పేదల కోసం ప్రవేశపెట్టిన పథకం అమలు అవుతుందా! లేదా అనేది ఆయా మండలాల పరిధిలోని రెవెన్యూ,సివిల్ సప్లై అధికారుల పర్యవేక్షణ, పరిశీలన ఏమాత్రం కనిపించడం లేదు. మిల్లర్ల యాజమాన్యం మాత్రం వారి లాభాల కోసం సన్న బియ్యాన్ని అధిక రేట్లతో అమ్మకాలు జరుపుతున్నారు. రాష్ట్రంలో పేదవాడి నుండి, ఉన్నోడి వరకు బియ్యం కొనుగోలు చేయాల్సిందే. కూలీ నాలీ చేసి జీవనం సాగిస్తున్న పేద, మధ్యతరగతి కుటుంబాలు ఆర్థిక భారం భరిస్తూ,అధిక ధరలకు రైస్ కొనుగోలు చేయక తప్పడం లేదు.జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు సబ్సిడీ బియ్యం ప్రతి పేదవాడికి అందేలా,మిల్లర్లలో జరుగుతున్న మతలబ్ లను పరిశీలించి చర్యలు చేపట్టి,సబ్సిడీ సన్న బియ్యం పథకం పేదలకు ఉపయోగపడేలా చర్యలు చేపట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని దారిద్ర రేఖ దిగువన ఉన్న పేద,మధ్యతరగతి కుటుంబాలు కోరుతున్నారు.

# జాన్వీ మార్ఫింగ్ వీడియో:

# ఇది సిగ్గుచేటైన చర్య అంటూ కుష్బూ ఫైర్

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీని దుర్వినియోగం చేస్తూ నటి జాన్వీ కపూర్‌కు సంబంధించిన మార్ఫింగ్ వీడియోను సృష్టించడంపై సీనియర్ నటి, రాజకీయ నాయకురాలు కుష్బూ సుందర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'దేవర' సినిమాలోని 'చుట్టమల్లె' పాటను మార్ఫింగ్ చేసి వైరల్ చేయడంపై ఆమె మండిపడ్డారు. ఇది వినోదం కాదని, ఒక మహిళ గౌరవానికి భంగం కలిగించే సిగ్గుచేటైన చర్య అని కుష్బూ ఘాటుగా స్పందించారు. ఈ ఘటనపై తన ఎక్స్ ఖాతాలో కుష్బూ సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. "ఏఐ ద్వారా చేసిన ఈ పని అస్సలు జోక్ కాదు. దీన్ని వినోదంగా గానీ, సాధారణ విషయంగా గానీ చూడకూడదు. ఇది చాలా క్రూరమైన, అవమానకరమైన, సిగ్గుచేటైన చర్య. దీని ద్వారా ఆమె గౌరవాన్ని చింపివేశారు" అని ఆవేదన వ్యక్తం చేశారు. "ఒక మహిళను లక్ష్యంగా చేసుకుని ఇలాంటి మార్ఫింగ్ వీడియోలు సృష్టించడం, వాటిని ప్రచారం చేయడం నన్ను తీవ్రంగా కలచివేసింది. టెక్నాలజీని ఆయుధంగా వాడి తన గౌరవానికి, భద్రతకు భంగం కలిగిస్తారనే భయంతో ఏ మహిళా బతకకూడదు. ఈ రోజు ఇది ఆమెకు జరిగింది, రేపు నాకు, మీకు, మన కూతురికి, సోదరికి, తల్లికి.. మనం ప్రేమించే ఏ మహిళకైనా జరగవచ్చు. బాధితులం మనం కాదు కదా అని మౌనంగా ఉండకూడదు. ఒక మహిళ గౌరవంపై దాడి జరిగినప్పుడు, ప్రతీ మహిళ నిలబడి గొంతు విప్పాలి" అని ఆమె పిలుపునిచ్చారు. ఇలాంటి కంటెంట్ సృష్టించే వారిని, తెలిసి కూడా వాటిని షేర్ చేసేవారిని, ప్రోత్సహించేవారిని కఠినంగా శిక్షించాలని కుష్బూ డిమాండ్ చేశారు. అప్పుడే ఇతరులకు ఇదొక గుణపాఠంగా మిగులుతుందని అభిప్రాయపడ్డారు. "మహిళ శరీరం వినోద వస్తువు కాదు. ఆమె గౌరవం ఆటబొమ్మ కాదు. ఆమె అవమానం హాస్యాస్పదం కాదు. ఏఐ టెక్నాలజీ ఎప్పటికీ మహిళలపై ఆయుధంగా మారకూడదు. మహిళలంతా ఏకమై 'ఇక చాలు' అని చెప్పాలి" అంటూ ఆమె స్పష్టం చేశారు. చివరగా, "జాన్వీ కపూర్.. నేను నీకు అండగా ఉన్నాను. ధైర్యంగా ఉండు బేటా" అని ఆమెకు భరోసా ఇచ్చారు. ఇదే విషయంపై శనివారం జూనియర్ ఎన్టీఆర్ కూడా స్పందించి, ఏఐ టెక్నాలజీతో ఫేక్ వీడియోలు సృష్టించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇలాంటి వాటిని ప్రచారం చేసే వారికి కూడా అవే పరిణామాలు ఉంటాయని స్పష్టం చేశారు. వీరితో పాటు మెగాస్టార్ చిరంజీవి, విజయ్ దేవరకొండ కూడా సోషల్ మీడియా వేదికగా ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు.






## సింగీతంకు కన్నీటి వీడ్కోలు...

## చెన్నైలో ముగిసిన అంత్యక్రియలు



భారతీయ సినీ యవనికపై తనదైన ముద్ర వేసిన విలక్షణ దర్శకుడు, లెజెండరీ ఫిలింమేకర్ సింగీతం శ్రీనివాసరావు అంత్యక్రియలు ముగిశాయి. చెన్నైలో ఆదివారం సాయంత్రం ఆయన అంత్యక్రియలు చెన్నైలోని నేసపాక్కం శ్మశాన వాటికలో కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు, సినీ ప్రముఖుల అశ్రు నయనాల మధ్య పూర్తయ్యాయి. భారతీయ సినిమాకు దశాబ్దాల పాటు విశేష సేవలందించిన ఓ మహోన్నత అధ్యాయం ఆయన మరణంతో ముగిసినట్లయింది. వయోభారంతో పాటు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న సింగీతం శ్రీనివాసరావు (94), చెన్నైలోని కావేరి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం తుదిశ్వాస విడిచిన విషయం తెలిసిందే. అనంతరం ఆయన భౌతికకాయాన్ని చెన్నై విరుగంబాక్కంలోని ఆయన నివాసానికి తరలించారు. ఆదివారం ఉదయం నుంచి పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు ఆయన నివాసానికి చేరుకుని పార్థివ దేహానికి నివాళులర్పించారు. సింగీతంతో ఎన్నో చారిత్రక చిత్రాల్లో పనిచేసిన విశ్వనటుడు కమల్ హాసన్, ఆయన నివాసానికి చేరుకుని తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. సింగీతం కుటుంబ సభ్యులను ఓదార్చి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సింగీతం మరణం పట్ల భారతీయ సినీ పరిశ్రమ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. దర్శకులు ఎస్.ఎస్. రాజమౌళి, మెగాస్టార్ చిరంజీవి, నందమూరి బాలకృష్ణ, జూనియర్ ఎన్టీఆర్, మహేశ్ బాబు వంటి ఎందరో అగ్ర తారలు, సాంకేతిక నిపుణులు సోషల్ మీడియా వేదికగా సంతాపం ప్రకటించారు. భారతీయ సినిమాలో ప్రయోగాలకు, నూతన ఒరవడులకు సింగీతం శ్రీకారం చుట్టారని, ఆయన లేని లోటు పూడ్చలేనిదని కొనియాడారు.

## అంచనాలు పెంచిన 'భోగి' టీజర్..

## కమ్మరి గంగగా శర్వానంద్ విశ్వరూపం!

టాలీవుడ్ యువ హీరో శర్వానంద్ తన పంథా మార్చి పూర్తిస్థాయి మాస్ యాక్షన్ అవతారంలోకి అడుగుపెట్టారు. ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'భోగి' టీజర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. దర్శకుడు సంపత్ నంది తనదైన శైలిలో రూపొందించిన ఈ టీజర్, సినిమాపై అంచనాలను భారీగా పెంచేసింది. పచ్చి పల్లెటూరి నేపథ్యం, తీవ్రమైన యాక్షన్ సన్నివేశాలు, బలమైన భావోద్వేగాలతో టీజర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. శర్వానంద్‌ను మునుపెన్నడూ చూడని రఫ్ లుక్‌లో చూపించడంతో అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు. ఈ సినిమా కథ 1960ల కాలంలో తెలంగాణ--మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలోని ఒక గ్రామంలో జరుగుతుందని టీజర్ ద్వారా స్పష్టమవుతోంది. ఆనాటి సమాజంలో పాతుకుపోయిన భూస్వామ్య వ్యవస్థ, అణచివేత, హింస వంటి అంశాలను కథలో ప్రధానంగా ప్రస్తావించినట్లు కనిపిస్తోంది. ఈ చిత్రంలో




శర్వానంద్ 'కమ్మరి గంగ' అనే శక్తివంతమైన పాత్రలో కనిపించనున్నారు. వృత్తిరీత్యా కమ్మరి అయిన గంగ, తన గ్రామాన్ని గుప్పిట్లో పెట్టుకున్న పెత్తందారులకు ఎదురు తిరిగే సామాన్యుడి ప్రతినిధిగా నిలబడతాడు. మట్టి వాసనను ప్రతిబింబించే దృశ్యాలు, రక్తపాతంతో నిండిన యాక్షన్ ఘట్టాలు ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఈ చిత్రంలో శర్వానంద్‌కు జోడీగా అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి కథానాయికలుగా నటిస్తున్నారు. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ పతాకంపై కేకే రాధామోహన్ ఈ చిత్రాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తుండగా, టీజర్‌లోని నేపథ్య సంగీతం సన్నివేశాలకు మరింత బలాన్నిచ్చింది. 'భోగి' చిత్రాన్ని నవంబర్ 12న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రంతో శర్వానంద్ మాస్ హీరోగా మరో మెట్టు ఎక్కుతారని అభిమానులు ఆశిస్తున్నారు.



# ఆసియా క్రీడల్లో భారత్ చరిత్రాత్మక ప్రదర్శన..

# ఈసారి సాధించిన విజయాలు సమ్‌థింగ్ స్పెషల్!

జపాన్‌లోని ఐచీ-నగోయా వేదికగా జరిగిన 2026 ఆసియా క్రీడల్లో భారత క్రీడాకారులు చరిత్రాత్మక ప్రదర్శనతో అదరగొట్టారు. మొత్తం 85 పతకాలు సాధించి, పతకాల పట్టికలో నాలుగో స్థానంలో నిలిచారు. ఇందులో 21 స్వర్ణాలు, 27 రజతాలు, 37 కాంస్య పతకాలు ఉన్నాయి. గత ప్రదర్శనను పునరావృతం చేస్తూ నాలుగో ర్యాంకును నిలబెట్టుకున్నప్పటికీ, ఈసారి విజయాలు మాత్రం అనేక క్రీడాంశాల్లో సరికొత్త చరిత్రను లిఖించాయి. 2023 హాంగ్‌జౌ క్రీడల తర్వాత భారత్‌కు ఇదే రెండో అత్యుత్తమ పతకాల ప్రదర్శన కావడం విశేషం.




**మహిళల హాకీకి 44 ఏళ్ల తర్వాత స్వర్ణం**

ఈ క్రీడల్లో భారత హాకీ జట్ల ప్రదర్శన ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఏకంగా 44 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత భారత మహిళల హాకీ జట్టు స్వర్ణ పతకాన్ని ముద్దాడింది. మరోవైపు, పురుషుల జట్టు తమ టైటిల్‌ను విజయవంతంగా నిలబెట్టుకుంది. ఒకే ఆసియా క్రీడల్లో పురుష, మహిళల హాకీ జట్లు రెండూ స్వర్ణాలు గెలవడం ఇదే తొలిసారి. ఇదే స్ఫూర్తితో క్రికెట్‌లోనూ భారత జట్లు సత్తా చాటాయి. పురుషుల, మహిళల విభాగాల్లో రెండు జట్లూ స్వర్ణ పతకాలను కైవసం చేసుకుని క్లీన్‌స్వీప్ చేశాయి.

**ఆర్చరీ, గోల్ఫ్‌లో కొత్త చరిత్ర**

వ్యక్తిగత విభాగాల్లోనూ భారత క్రీడాకారులు అద్భుతాలు చేశారు. 17 ఏళ్ల యువ ఆర్చర్ కుంకుమ్ మోహోద్ వ్యక్తిగత రికర్వ్ విభాగంలో స్వర్ణం గెలిచిన తొలి భారతీయ మహిళగా చరిత్ర సృష్టించింది. మహిళల రికర్వ్ జట్టు కూడా స్వర్ణం గెలిచి, ఈ విభాగంలో దశాబ్దాలుగా ఆధిపత్యం చెలాయిస్తున్న దక్షిణ కొరియాకు గట్టి షాక్ ఇచ్చింది. గోల్ఫ్‌లో, ప్రణవి ఉర్స్ మహిళల వ్యక్తిగత విభాగంలో స్వర్ణం గెలిచిన తొలి భారతీయ గోల్ఫర్‌గా నిలిచింది. రెజ్లింగ్‌లో అమన్ సెహ్రావత్ పురుషుల 57 కేజీల ఫ్రీస్టైల్ విభాగంలో స్వర్ణం గెలిచి, ఈ కేటగిరీలో భారత్‌కు తొలి బంగారు పతకాన్ని అందించాడు. షూటింగ్‌లో నీరూ ధండా 48 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ మహిళల వ్యక్తిగత ట్రాప్ విభాగంలో స్వర్ణం కైవసం చేసుకుంది.



**ఎన్నో విభాగాల్లో తొలిసారి విజయాలు**

ఈ విజయాలతో పాటు భారత్ మరికొన్ని కొత్త క్రీడాంశాల్లోనూ తన ఖాతా తెరిచింది. మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ (ఎంఎంఏ), సాఫ్ట్ టెన్నిస్‌లలో తొలిసారిగా పతకాలను గెలుచుకుంది.

అలాగే, మహిళల పోల్ వాల్ట్, కొన్ని షూటింగ్ కేటగిరీలలోనూ మొదటిసారి పతకాలు సాధించి భారత క్రీడారంగం విస్తరిస్తున్న తీరును ప్రపంచానికి చాటిచెప్పింది. మొత్తం మీద ఈ ఆసియా క్రీడల ప్రదర్శన పతకాల సంఖ్యలోనే కాకుండా, సాధించిన విజయాల ప్రాధాన్యత పరంగానూ భారత్‌కు చిరస్మరణీయంగా నిలిచిపోనుంది.



## ఈ స్వర్ణం తేలిగ్గా రాలేదు..

## వారి అనుభవమే మా విజయానికి కారణమైంది: సంజూ శాంసన్

ఆసియా క్రీడల పురుషుల క్రికెట్‌లో భారత జట్టు స్వర్ణ పతకాన్ని నిలబెట్టుకుంది. ఉత్కంఠభరిత ఫైనల్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై 19 పరుగుల తేడాతో విజయం సాధించింది. అయితే, ఈ స్వర్ణం తమకు సులభంగా దక్కలేదని, దీనికోసం తీవ్రంగా శ్రమించాల్సి వచ్చిందని భారత వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ అన్నాడు. అనుభవజ్ఞులైన ఆటగాళ్లతో కూడిన 'ఏ' టీమ్‌ను బరిలోకి దించడం వల్లే పాకిస్థాన్‌తో ఫైనల్ మ్యాచ్‌లో ఒత్తిడిని అధిగమించగలిగామని స్పష్టం చేశాడు. ఈ విజయం అనంతరం సంజూ శాంసన్ మాట్లాడుతూ.. "మాది చాలా అనుభవజ్ఞులైన జట్టు. ప్రాక్టీస్, మ్యాచ్‌లు లేనప్పుడు కూడా మమ్మల్ని మేము ఎలా ప్రేరేపించుకోవాలో, శక్తిని ఎలా కాపాడుకోవాలో మాకు తెలుసు. ఆసియా క్రీడలకు 'ఏ' టీమ్‌ను తీసుకురావడం నిజంగా కలిసి వచ్చింది. పాకిస్థాన్‌తో ఫైనల్‌లో అదే జరిగింది. అందరికీ ఇది ఒక సరైన మ్యాచ్‌లా అనిపించింది" అని వివరించాడు. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్.. అభిషేక్ శర్మ, తిలక్ వర్మ అద్భుత అర్ధసెంచరీలతో రాణించడంతో నిర్ణీత ఓవర్లలో 6 వికెట్లకు 211 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం లక్ష్య ఛేదనలో పాకిస్థాన్ కూడా గట్టిగానే పోరాడింది. బ్యాటింగ్‌కు అనుకూలించిన పిచ్‌పై దూకుడుగా ఆడి, చివరి వరకు మ్యాచ్‌ను ఉత్కంఠగా మార్చింది. అయితే, భారత బౌలర్లు సమష్టిగా రాణించడంతో పాకిస్థాన్ 6 వికెట్లు కోల్పోయి 192 పరుగులకే పరిమితమైంది. "చివరకు ఒక మంచి మ్యాచ్ ఆడే అవకాశం లభించింది. మేం 200 పరుగులు చేశాక పాకిస్థాన్‌కు ఛేజింగ్ కష్టమవుతుందని అనుకున్నాం. కానీ, వికెట్ బాగుండటంతో వాళ్లు కూడా బాగా ఆడారు. ప్రేక్షకులకు ఒక మంచి ఫైనల్ చూసే అవకాశం దక్కింది. ఈ స్వర్ణం మాకు సులభంగా దక్కలేదు. కష్టపడి సాధించాం కాబట్టే ఎక్కువ సంతృప్తినిచ్చింది. మేమంతా చాలా సంతోషంగా ఉన్నాం" అని సంజూ పేర్కొన్నాడు. ఆసియా క్రీడల ఫైనల్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించడం గొప్ప అవకాశమని, అయితే ఆట ప్రారంభమయ్యాక పరిస్థితులకు అనుగుణంగానే

## బీసీలకు 34 శాతం రిజర్వేషన్లే లక్ష్యం..

# సామాజిక న్యాయమే మా ప్రభుత్వ విధానం

### - బీసీల రాజకీయ ప్రాతినిధ్యం కోసం కట్టుబడి ఉన్నాం: మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

**అన్నమయ్య బ్యూరో- సూర్య వాస్తవం:** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. బీసీలకు రాజకీయంగా సముచిత ప్రాతినిధ్యం కల్పించడంతో పాటు సామాజిక న్యాయాన్ని సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అన్ని స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. బడుగు బలహీన వర్గాలకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. బడుగు బలహీన వర్గాలకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో అసెంబ్లీలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ ఇచ్చేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుని జీవో నంబర్ 105, 1065 జారీ చేసిందని తెలిపారు. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. ఎన్నికలు జరగకపోయినా, బీసీలకు రిజర్వేషన్ దక్కకూడదనే కుట్రతో గోడ్డలి పార్టీ నేతలు అడ్డుకుంటున్నారని మంత్రి విమర్శించారు. బీసీలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందని స్పష్టం చేశారు. న్యాయపరంగా ఉన్న ప్రతి అవకాశాన్ని ఉపయోగించుకుని బీసీలకు న్యాయం జరిగేలా చూస్తామని, వైసీపీ హయాంలో 34 శాతం రిజర్వేషన్ల




కోసం కొట్టేసిన సుప్రీంకోర్టు తీర్పులకు వ్యతిరేకంగా వెళ్లకుండా బీసీలకు చారిత్రాత్మక ద్రోహం చేశారని మంత్రి పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్ కల్పించాలన్న తమ సంకల్పం మారదని, బీసీలకు న్యాయం జరిగే వరకు కృషి చేస్తామని తెలిపారు. 34 శాతం రిజర్వేషన్లతోనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని మంత్రి అన్నారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్ ఇస్తే రాజకీయ ప్రాతినిధ్యం పెరుగుతుందని, కులంతో సంబంధం లేకుండా అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు.

**బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం పెరగాలి**

బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా వారి సమస్యలను మరింత సమర్థవంతంగా పరిష్కరించే అవకాశం ఉంటుందని మంత్రి అన్నారు. సమాజంలో వెనుకబడి ఉన్న బీసీల అభ్యున్నతి కోసం తమ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు. హైకోర్టు తీర్పును గౌరవిస్తూ బీసీలకు న్యాయం జరిగేలా సుప్రీంకోర్టులో న్యాయపరమైన పోరాటం కొనసాగిస్తామని మంత్రి తెలిపారు. ఇది కేవలం రిజర్వేషన్ల అంశం మాత్రమే కాదని, బీసీలకు దక్కాల్సిన రాజకీయ ప్రాతినిధ్యానికి సంబంధించిన అంశమని స్పష్టం చేశారు. నాలుగు దశాబ్దాలుగా బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించే దిశగా వివిధ ప్రభుత్వాలు చర్యలు తీసుకున్నాయని మంత్రి గుర్తు చేశారు. 1987లో బీసీలకు 20 శాతం, 1995లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. బీసీలకు రాజకీయ సాధికారత కల్పించడమే లక్ష్యంగా ఈ విధానం కొనసాగుతోందన్నారు. బీసీలకు న్యాయం జరగాలి.. వారికి దక్కాల్సిన రాజకీయ ప్రాతినిధ్యం దక్కాలి. 34 శాతం రిజర్వేషన్ల అమలు కోసం ప్రభుత్వం రాజ్యాంగబద్ధమైన, న్యాయపరమైన మార్గాల్లో ముందుకు సాగుతుంది అని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు.

## వెటరన్ జర్నలిస్టుల ఆరోగ్య భద్రతకు

# ప్రత్యేక ప్రాధాన్యతనిస్తున్న డాక్టర్ నిసార్ యాసీన్ ఖాన్

**-వెటరన్ జర్నలిస్టుల ఆరోగ్య భద్రతకు వైద్యుడు యాసిన్ హెల్త్ కార్డుల హామీ**

**-జిల్లా వెటరన్ జర్నలిస్టుల సంక్షేమ అభివృద్ధికి రూ.1.5 లక్షల సహాయనిధి ఏర్పాటు**




**రాయచోటి-సూర్య వాస్తవం:** ఇటు ప్రజలకు అటు ప్రభుత్వానికి వారిది గా నిస్వార్థ సేవలు అందించిన అప్పటి జూనియర్ జర్నలిస్టులు నేటి వెటర న్ జర్నలిస్టులుగా మారారని నిమ్స్ హాస్పిటల్ ఎండి డాక్టర్ యాసిన్ ఖాన్ అన్నారు. రాయలసీమ వెటరన్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పుట్టపర్తి సాయి ఆరామం ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై వేదికపై మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా పత్రికా రంగంలో పనిచేసిన వెటరన్ జర్నలిస్టులు ప్రజల ఎన్నో సమస్యలను పరిష్కరించుటకు సహకరించి, ప్రభుత్వానికి సలహాలు సూచనలు అందించి, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించిన వెటర్ న్ జర్నలిస్టులు నేడు తమ ఆరోగ్య, ఆర్థిక సమస్యలు పరిష్కరించుకొనుటకు సతమత అవుతున్నారని అన్నారు. ప్రజలు, ప్రభుత్వము వీరికి సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది అన్నారు. ఈ సందర్భంగా నిసార్ యాసిన్ మాట్లాడుతూ శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన వెటరన్ జర్నలిస్టుల ఆరోగ్య భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. వెటరన్ జర్నలిస్టుల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని హెల్త్ కార్డులను పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు. ఆరోగ్యపరమైన అవసరాల సమయంలో ఈ హెల్త్ కార్డులు జర్నలిస్టులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అదేవిధంగా వెటరన్ జర్నలిస్టుల సంక్షేమం, అభివృద్ధి కోసం రూ. 1.5 లక్షల సహాయనిధిని ఏర్పాటు చేస్తున్నట్లు నిసార్ యాసిన్ ఖాన్ వెల్లడించారు. జర్నలిస్టుల సంక్షేమానికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని, భవిష్యత్తులోనూ అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. సమాజానికి వాస్తవాలను ప్రజలకు చేరవేయడంతో పాటు ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని ఆయన అన్నారు. ఎన్నో సంవత్సరాలుగా పాత్రికేయ రంగంలో సేవలందించిన వెటరన్ జర్నలిస్టుల సంక్షేమం, ఆరోగ్య భద్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో జర్నలిస్టుల ఆరోగ్యం, సంక్షేమం, వృత్తిపరమైన సమస్యలు, భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. వెటరన్ జర్నలిస్టులకు ఆరోగ్య భద్రత కల్పించడంతో పాటు వారి సంక్షేమ అభివృద్ధికి మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని సమావేశంలో అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేషన్ ప్రతినిధులు, శ్రీ సత్యసాయి జిల్లా వెటరన్ జర్నలిస్టులు, రాయలసీమ వెటరన్ జర్నలిస్ట్ అసోసియేషన్ ప్రతినిధులు, సీనియర్ పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో జర్నలిస్టుల ఆరోగ్యం, సంక్షేమం, వృత్తిపరమైన సమస్యలు, భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. వెటరన్ జర్నలిస్టులకు ఆరోగ్య భద్రత కల్పించడంతో పాటు వారి సంక్షేమ అభివృద్ధికి మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని సమావేశంలో అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేషన్ ప్రతినిధులు, శ్రీ సత్యసాయి జిల్లా వెటరన్ జర్నలిస్టులు, రాయలసీమ వెటరన్ జర్నలిస్ట్ అసోసియేషన్ ప్రతినిధులు, సీనియర్ పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

# తోడుకో ..పో.. అమ్ముకో...

**- అడుగంటిపోయిన భూగర్భ జలాలు**

**- పలు గ్రామాలలో త్రాగునీటి సమస్యతో అల్లాడుతున్న ప్రజలు**

**- నామమాత్రంగా చర్యలు**

**- పట్టించుకోని జిల్లా అధికారులు**





**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం :** అన్నమయ్య, కడప జిల్లాల పరిధిలోని పలు మండలాల్లో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. దీంతో పలు మండలాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోయి ఇప్పటికే తాగునీటి సమస్యతో ప్రజలు కొట్టుమిట్టాడుతున్నారు. మండల స్థాయి అధికారులు తూతు మంత్రంగా చర్యలు తీసుకోవడంతో అక్రమరవాణా యధావిధిగా కొన సాగుతూనే ఉంది. దీంతో నది పరివాహ ప్రాంతాల్లోనే ప్రజలు భూగర్భజాలు ఎక్కువ అడుగంటి పోవడంతో పంట పొలాల సాగుతో పాటు తాగునీటికి ఇక్కట్లు తప్పడం లేదని వాపోతున్నారు. ఇదేమిటని ప్రజలు అధికారులను పలుచోట్ల ప్రశ్నిస్తే గ్రామాల్లో మీరే ఇసుక ట్రాక్టర్లను అడ్డుకోవాలని తమపై భారం వేస్తే ఎంత మందిని అరికట్టాలి అంటూ తెలిపినట్లు సమాచారం. ఏది ఏమైనా ఇసుక తోడుకో.. పో... అమ్ముకో అన్న చందంగా నిత్యం వందల ట్రాక్టర్లు రాయచోటి తదితర ప్రాంతాలకు తరలిస్తూరూ. 2500 నుంచి 3000 రూపాయల వరకు సొమ్ము చేసుకుంటున్నారు నిత్యం కార్యాలయాలకు తమ విధులు నిర్వహించేందుకు అధికారులు వస్తున్నప్పుడు వారికి ఎదురుగా ఇసుక ట్రాక్టర్లు వస్తున్నప్పటికీ కనీసం పట్టించుకున్న పాపాన పోలేదని పలువురు విమర్శిస్తున్నారుఏది ఏమైనా జిల్లా అధికారులు తగు చర్యలు తీసుకుంటే కానీ ఈ ఇసుక అక్రమ రవాణా ఆగదని పలువురు మండల కామ గ్రామీణ ప్రాంత ప్రజలు వాపోతున్నారు.

## ప్రతి ఇంటికి నీరు అందించడమే సీఎం, డిప్యూటీ సీఎంల లక్ష్యం

**-జనసేన పార్టీ నాయకుడు ఆడిటర్ మన్సూర్ అలీ ఖాన్**




**రాయచోటి-సూర్య వాస్తవం:** హర్ ఘర్ జల్ ప్రతి ఇంటికి నీరు అందించాలన్నదే ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఏపీ డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కళ్యాణ్ ల ధ్యేయమని స్థానిక జనసేన పార్టీ నియోజకవర్గ నాయకుడు ఆడిటర్ మన్సూర్ అలీ ఖాన్ చెప్పారు. ఈనెల 5 తేదీ జల జీవన్ మిషన్ ప్రాజెక్టుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి కలిసి ప్రొద్దుటూరుకు రావడం మాకు చాలా సంతోషంగా, ఆనందంగా ఉందని ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతాభి వందనములు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ...గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికి ఫంక్షనల్ హౌస్ హోల్డ్ టాప్ కనెక్షన్ ద్వారా వ్యక్తిగత కులాయి కనెక్షన్లను అందించడం జలజీవన్ మిషన్ యొక్క ప్రధాన లక్ష్యమని తెలిపారు.

## ఘనంగా గౌసేపాక్ దస్తగిరి దర్గా స్వామి ఉరుసు మహోత్సవం





**సిద్ధవటం -సూర్యవాస్తవం :** మండలకేంద్రమైన సిద్ధవటం ఎగువపేట జెండామాను వీధిలో వెలిసిన గౌసేపాక్ దస్తగిరి దర్గా నందు ఉరుసు మహోత్సవం ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు జెండామాను వీధిలో వెలసిన గౌసేపాక్ దస్తగిరి దర్గా నుంచి జండాను పూల చాందినీ ట్రాక్టర్ లో ఉంచి పురవీధుల గుండా ఊరేగించారు. మొక్కుబడులు ఉన్న భక్తులు టెంకాయ, చక్కర తో ఫాతేహా నిర్వహించారు. వచ్చిన హిందూ, ముస్లిం సోదరులకు నిర్వాహకులు అన్న ప్రసాదాలను ఏర్పాటు చేశారు. అనంతరం గజల్ ఏర్పాటు చేయగా పలువురిని ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో జనసేన రాజంపేట పార్లమెంట్ సమన్వయ కర్త అతికారి కృష్ణ, గౌస్ బాషా, ఆరీఫ్, మహబూబ్ బాషా (బాబి) తదితర ముస్లిం సహోదరులు పాల్గొన్నారు.

## కబడ్డీలో శ్రీ సాయి కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

**- జిల్లా జట్లకు 8 మంది ఎంపిక**



**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం:** రాయచోటి: శ్రీ సాయి కాన్సెప్ట్ స్కూల్, మాసాపేట, రాయచోటి విద్యార్థులు కబడ్డీ క్రీడలో సత్తా చాటి అన్నమయ్య జిల్లా జట్లకు ఎంపికై పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు. అన్నమయ్య జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపికల్లో సబ్-జూనియర్ జట్టుకు యస్ .అఫీన్, కె రెడ్డి ప్రసన్న, కె.మహా, యమ్.నిహారిక, వీ.లీనా అల్ఫియా, జూనియర్ జట్టుకు యస్ అఫ్షీన్, జీ.హస్నా నుస్రత్ ఎంపిక కాగా, యస్‌జీ యఫ్ యు-19 జిల్లా జట్టుకు కె. రెడ్డి ప్రసన్న ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో అన్నమయ్య జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. విద్యార్థుల ప్రతిభపై పాఠశాల చైర్మన్ ఐకె.పీ.వీ సుబ్బయ్య , ఏ.వో.ఐ రాయుడు, ప్రిన్సిపాల్ ,ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేస్తూ వారిని అభినందించారు. రాష్ట్రస్థాయిలో కూడా అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు, పాఠశాలకు మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. శ్రీ సాయి కాన్సెప్ట్ స్కూల్‌లో చదువుతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇస్తున్నామని పాఠశాల యాజమాన్యం పేర్కొంది. విద్యార్థుల సమగ్ర వికాసానికి విద్యతో పాటు క్రీడలు ఎంతో అవసరమని, క్రీడల ద్వారా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, జట్టు స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు, పట్టుదల మరియు శారీరక దారుఢ్యం పెంపొందుతాయని తెలిపారు. “మా లక్ష్యం మంచి మార్కులు సాధించే విద్యార్థులను మాత్రమే కాకుండా, విద్య, క్రీడలు మరియు వ్యక్తిత్వ వికాసంలో రాణించే సంపూర్ణ వ్యక్తిత్వం కలిగిన విద్యార్థులను తీర్చిదిద్దడం” అని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS
ADDRESS : 41/1320, Sankarapuram, Kadapa, YSR Kadapa District, ANDHRA PRADESH-516002, CELL : : 9885404140